

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

28 నుంచి 'మన ఇల్లు-మన గౌరవం'

- గృహ నిర్మాణాలపై ప్రత్యేక కార్యక్రమం
- పనులను వేగవంతం చేయాలి
- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 21 : జిల్లాలో వివిధ పథకాల కింద మంజూరైన గృహాలను పూర్తి చేసేందుకు మన ఇల్లు-మన గౌరవం పేరుతో ఈనెల 28నుంచి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం మండల స్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. గృహ నిర్మాణాల పురోగతిని సమీక్షించి దిశానిర్దేశం చేశారు. పీఎంఏవై 1.0 కింద మంజూరైన గృహాల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు హౌసింగ్ లేఅవుట్లలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడాలని సూచించారు. వంద రోజుల్లో జిల్లాలో 3,044 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. వాటిలో ఇప్పటి వరకూ 345 పూర్తి చేశామన్నారు. మిగిలిన 2,699 ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణం కోసం ఉపాధి పథకం కింద 90 రోజులు పని దినాలను కేటాయించడం జరిగిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ, ఆయాశాఖల అధికారులు శ్రీనివాస ప్రసాద్, ఉషారాణి, మాధురి, వసుంధర, రవికుమార్, జగన్నాథరావు, శ్రీనివాసరావు, అంజల తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. అందుకోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై వైసీపీ పాలకుల నిర్వాకంతో జిల్లాలో వివిధ దశల్లో నిలిచిపోయిన 16,066 ఇళ్లను దశల వారీగా నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా తొలి దశ కింద 100 రోజుల్లో 3,044 గృహ ప్రవేశాలను లక్ష్యంగా నిర్దేశించింది. తదనుగుణంగా గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. లబ్ధిదారులతో మాట్లాడటంతోపాటు అవసరమైన నిర్మాణ సామగ్రిని అందుబాటులోకి తెస్తున్నారు. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన వాటిలో 26వేల గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు ఇప్పటి వరకూ ప్రారంభించ లేదు. యూనిట్ వ్యయం అతి తక్కువగా ఉండటం, అది బేస్‌మట్టంకు కూడా సరిపోకపోవడంతో వారు వెనకడుగు వేశారు. ప్రస్తుతం ఈ గృహాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. యూనిట్ వ్యయం పెంచి కొత్తగా మంజూరు చేయనున్నట్లు సమాచారం.



100 రోజులు..

3,044 గృహాలు

లబ్ధిదారులకు వారంవారం బిల్లుల చెల్లింపు

గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన వాటిలో 26 వేల ఇళ్లు రద్దు!

యూనిట్ విలువ తక్కువ ఉండటంతో నిర్మాణాలు ప్రారంభించని పేదలు

మళ్లీ వారికి యూనిట్ విలువ పెంచి మంజూరు చేయనున్న కూటమి ప్రభుత్వం

లెంటల్, శ్లాబు దశకు వచ్చిన వాటి నిర్మాణాల పూర్తికి ప్రణాళిక

ఒంగోలు నగరం, సెప్టెంబరు 21 : పక్కా గృహాల నిర్మాణాలను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఆర్భాటంగా గృహాలను మంజూరు చేసినప్పటికీ యూనిట్ విలువ తక్కువగా ఉండటంతో అనేక మంది లబ్ధిదారులు ముందుకు రాలేదు. ఇలాంటి వారు జిల్లాలో 26వేల మంది వరకూ ఉన్నారు. అదేసమయంలో అంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాం(2014-19)0))లో గృహాలు మంజూరై నిర్మాణాలు చేపట్టిన వారికి అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు నిలిపివేసింది. దీంతో జిల్లాలో వేలాది మంది తమ ఇంటి నిర్మాణాలను అర్ధంతరంగా ఆపేసుకున్నారు. ఇలా 16,066 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. వీటికి పాత బిల్లులు చెల్లించి వెంటనే నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అదేసమయంలో యూనిట్ విలువ పెంచి కొత్త గృహాలు మంజూరు చేయాలని భావిస్తోంది.

లబ్ధిదారులకు అదనంగా రూ.35వేల రుణం

జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి వివిధ దశల్లో నిలిచిపోయిన 16,066 ఇళ్లలో లెంటల్, శ్లాబు దశకు చేరి ఆగిపోయిన 3,044 నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ సంస్థ ప్రణాళిక రూపొందించింది. అందుకు 100 రోజులు లక్ష్యంగా పెట్టుకుంది. ఆమేరకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. లెంటల్, శ్లాబు దశకు చేరిన గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్నారు. నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేస్తున్నారు. వీరికి రూ.1.80 లక్షల యూనిట్ విలువతోపాటు మరో రూ.35 వేల రుణం ఇప్పించనున్నారు. పక్కాగృహాలు నిర్మించుకుంటున్న వారంతా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరికి ఇప్పటికే గృహ నిర్మాణాలకు బ్యాంకుల నుంచి రూ.35వేల రుణం అందించారు. అదనంగా రూ.35వేల ఇప్పించనున్నారు. అందుకు బ్యాంకులు కూడా సిద్ధంగా ఉండటంతో గృహ నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. అధికారులు కూడా లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇటుక, కంకర, ఇసుక, స్టీలు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటి వరకూ లబ్ధిదారులు బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కానీ కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పింది. వారంవారం బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించింది.

26 వేల పక్కా గృహాలు రద్దు

గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన వాటిలో ఇప్పటి వరకూ 26 వేల పక్కా గృహాల నిర్మాణం ప్రారంభం కాలేదు. యూనిట్ విలువ సరిపోకపోవడమే ఇందుకు కారణమైంది. ఒక్కో పక్కా గృహ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. మరో రూ.30వేలు ఉపాధి హామీ పథకం కింద చెల్లించేది. దాన్ని కలిపి యూనిట్ విలువ మొత్తం రూ.1.80 లక్షలు మాత్రమే. ఈ మొత్తం బేసు మట్టం నిర్మాణానికి కూడా సరిపోయేది కాదు. దీంతో అనేక మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం పక్కా గృహాలకు యూనిట్ విలువను పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసి పనులు ప్రారంభించని లబ్ధిదారులు వాటిని నిర్మించుకునేందుకు విముఖత చూపుతున్నారు. యూనిట్ విలువ పెరుగుతున్నందున కొత్త ప్రభుత్వంలో ఇంటిని మళ్లీ మంజూరు చేయించుకుని కట్టుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గతంలో మంజూరై నేటికీ ప్రారంభం కాని ఇళ్లను కూటమి ప్రభుత్వం త్వరలో రద్దు చేస్తుందని గృహ నిర్మాణ సంస్థ అధికారులు అంటున్నారు.

ఒంగోలులో ఫ్లెక్సీ రగడ..!

బాలినేని ఫ్లెక్సీలో ఎమ్మెల్యే దామచర్ల ఫొటో

తెలుగు తమ్ముళ్ల ఆగ్రహం

కనిపించని జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ బొమ్మ





ఒంగోలు చర్చిసెంటర్‌లో ఏర్పాటు చేసిన బాలినేని ఫ్లెక్సీలో ఉన్న జనార్దన్ ఫొటో (ఇన్‌సెట్లో) తొలగించి తీసుకెళుతున్న కార్పొరేషన్ సిబ్బంది

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 21 : ఒంగోలులో ఫ్లెక్సీ రగడ చోటుచేసుకుంది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలోకి రావడాన్ని స్వాగతిస్తూ ఆయన అభిమానులు శనివారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారితీసింది. వైసీపీకి చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవల ఆపార్టీకి రాజీనామా చేశారు. జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఆపార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఈనెల 26న ఆయన జనసేనలో చేరేందుకు దాదాపు ముహూర్తం కూడా ఖరారైంది. ఈనేపథ్యంలో బాలినేని అభిమాని అయిన ఇందుర్తి ప్రసాద్ (వైసీపీ కార్యకర్త), ఆయన స్నేహితులు కలిసి 'జిల్లా మెగాస్టార్ వాసన్నకు శుభాకాంక్షలు' అంటూ ఒంగోలులోని చర్చి సెంటర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అందులో బాలినేని ఫొటోతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు సినీ హీరో చిరంజీవి, టీడీపీకి చెందిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫొటోలను ఉంచారు. దీనిపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని తొలగించేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన కార్పొరేషన్ అధికారులు ఆ ఫ్లెక్సీని తొలగించి కార్పొరేషన్ కార్యాలయానికి తరలించారు.

ఎవరినడిగి ఫొటో పెట్టారు? : తెలుగు తమ్ముళ్లు

బాలినేని ఫ్లెక్సీలో ఎమ్మెల్యే దామచర్ల ఫొటో పెట్టడంపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసరావుతోపాటు యువత నగర అధ్యక్షుడు నలమోతు రమేష్, ఉపాధ్యక్షుడు ఉమర్ మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉండటంతో టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టించి అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన బాలినేని.. ఫ్లెక్సీలో తమ నాయకుడు దామచర్ల ఫొటోను ఎవరిని అడిగి పెట్టారని ప్రశ్నించారు. ఫ్లెక్సీలో దామచర్ల ఫొటో పెట్టడం ఉద్దేశపూర్వకంగానే జరిగిందన్నారు. తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇదిలాఉండగా ఫ్లెక్సీలో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఫొటో లేకపోవడం విమర్శలకు తావిచ్చింది. దీనిపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

26న జనసేనలోకి బాలినేని

నేటి నుంచి అనుచరులతో భేటీలు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చేరికలకు ప్లాన్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఈనెల 26న జనసేన పార్టీలో చేరనున్నారు. ఆదివారం నుంచి జిల్లాలోని తన అనుచరులతో ఆయన భేటీ కానున్నారు. వచ్చేనెల 4వ తేదీన ఒంగోలులో జరిగే కార్యక్రమంలో చేరాలని బాలినేని భావించి ఆ మేరకు ప్రకటించారు. ఆ వెంటనే జగన్ జిల్లాలోని వైసీపీ నాయకులను కాపాడుకునే లక్ష్యంతో పార్టీ నేతలతో భేటీ అయి బూచేపల్లికి జిల్లా అధ్యక్ష పదవి, చెవిరెడ్డికి ఒంగోలు లోక్‌సభ పరిశీలకుడిగా బాధ్యతలు ఇచ్చారు. కిందిస్థాయి నాయకులెవ్వరూ బాలినేనితో వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కారణం ఏమైనా జనసేన రాష్ట్ర నాయకత్వం కూడా బాలినేనిని త్వరగా పార్టీలోకి చేర్చుకోవాలని భావించింది. ఈ మేరకు 26వ తేదీ మంగళగిరి వద్ద జరిగే కార్యక్రమంలో మీ అనుచరులతోపాటు మీరూ చేరాలని ఆయనకు సూచించారు. దీంతో బాలినేని జిల్లాకు వచ్చి వైసీపీలో ఉన్న తన అనుచరులను సమీకరించుకునేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి ప్రకాశంలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కనీసం 10 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ద్వితీయశ్రేణి నాయకుల్లో కొందరిని తనతోపాటు జనసేనలోకి తీసుకెళ్లే వ్యూహంలో బాలినేని ఉన్నట్లు తెలిసింది. ఆరేడు నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీల్లో కొందరు ఆయన వెంట నడిచే అవకాశం ఉంది. ఒంగోలు కార్పొరేషన్‌లోని వైసీపీ కార్పొరేటర్లల్లో సుమారు 23 మంది ఇంకా పార్టీలోనే ఉండటంతో వారిలో అత్యధికులను కూడా తనతో తీసుకెళ్లే ప్రయత్నంలో బాలినేని ఉన్నట్లు సమాచారం. అందుకే ఆయన ఆదివారం మధ్యాహ్నానికి ఒంగోలు చేరుకొని వైసీపీలో తనతో పరిచయం ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులతో భేటీ కావాలని నిర్ణయించుకున్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన అధికారులు



హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్లుకు బొకే ఇస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 21 : హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎస్.వెంకటేశ్వర్లు శనివారం ఒంగోలు వచ్చారు. స్థానిక ఎస్ఎస్పీ అతిథి గృహంలో బస చేసిన ఆయన్ను కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాలోని వివిధ రకాల పెండింగ్ కేసులు, వాటి సత్వర పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వారి మధ్య చర్చ జరిగింది. హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన వారిలో ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

వీఆర్‌లో ఉన్న 15 మంది ఎస్సైలకు పోస్టింగ్

- నగరంలోని మూడు స్టేషన్‌లకు 11 మంది కేటాయింపు

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 21 : జిల్లాలో వీఆర్‌లో ఉన్న 15 మంది ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలు నగరంలో మూడు పోలీసు స్టేషన్‌లకు 11 మందిని కేటాయించారు. తాలుకాకు ఐదుగురు, వన్‌టౌన్, టూటౌన్‌కు ముగ్గురేసిని నియమించారు. వీఆర్‌లో ఉన్న టి.త్యాగరాజు, పి.శివనాగరాజు, జి.సుబ్రమణ్యంలను ఒంగోలు వన్‌టౌన్‌కు, ఎస్‌కే అబ్దుల్ రహమాన్, ఎం.శివనాంచారయ్య, ఏవీ సుబ్బారావును ఒంగోలు టూటౌన్‌కు కేటాయించారు. తాలుకా పోలీసు స్టేషన్‌కు వి.హరిబాబు, జి.సందీప్, ఎండీ ఫిరోజ్, ఎం.అనిత, కె.శ్రీనివాసరావును నియమించారు. పుల్లలచెరువు ఎస్సైగా నియమితులై ఇంకా బాధ్యతలు స్వీకరించని వి.రాజేష్‌ను వీసీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న ఎల్.సంపత్ కుమార్‌ను పుల్లలచెరువు, జి.ప్రభాకర్‌రెడ్డిని గిద్దలూరు, వి.వెంకటేశ్వరరావును డీసీఆర్‌బీకి బదిలీ చేశారు.



ఒంగోలు నగరంలోని చర్చి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

కల్తీ లడ్డూ బాధ్యులను శిక్షించాలి

- బీజేపీ నేత యోగయ్య యాదవ్ డిమాండ్
- భక్తుల మనోభావాలను వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని ధ్వజం
- ఒంగోలులో నిరసన

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 21 : తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారన్న అభియోగాలపై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. టీటీడీ పవిత్రతను కాపాడాలని కోరుతూ స్థానిక చర్చిసెంటర్‌లో శనివారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా టీటీడీలో జరిగిన అవినీతి బయటకు రావాలంటే కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సీబీఐచే విచారణ చేయించాలన్నారు. లడ్డూ తయారీలో కల్తీకి కారకులైన అప్పటి టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డిలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి సీఎం జగన్‌రెడ్డికి తెలిసే ఈ కల్తీ లడ్డూల తయారీ జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఐ.సీతారామయ్య, బొద్దులూరి ఆంజనేయులు, కటారి సుధాకర్, గుర్రం రంగనాథ్, గుర్రం సత్యనారాయణ, గుర్రం శ్రీనివాసరావు, కావూరి వాసు, విజయ్, వీరబ్రహ్మాచారి, మధు, కిలారు రవి, కె.ఆంజనేయులు, యు .నాగేశ్వరరావు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈపాపం ఊరికేపోదు : మంత్రి స్వామి



టంగుటూరు : 'శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. ఈపాపం ఊరికే పోదు జగన్‌రెడ్డీ' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం స్థానికంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీని అపవిత్రం చేసింది మీరే కదా! చేసిందంతా చేసి గుమ్మడికాయ దొంగల్లా జగన్, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని మంత్రి నిలదీశారు. తప్పులు చేయడం, బుకాయించడం వైసీపీ నేతలకు అలవాటేనన్నారు. శ్రీవారి ప్రసాదం కల్తీ ఘటనపై సీబీఐ విచారణ కోరే ధైర్యం వైసీపీ నాయకత్వానికి ఉందా అని మంత్రి ప్రశ్నించారు.

డెంటల్ డాక్టర్స్ విరాళం రూ.10లక్షలు



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న వైద్యులు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 21: ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇండియన్ డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ (ఐడీఏ) ఆధ్వర్యంలో రూ.10లక్షలు విరాళాన్ని శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, సెక్రటరీ డాక్టర్ అజయ్‌బెనర్జీ, మహిళా డెంటల్ కౌన్సిల్ డాక్టర్ మధురాణి, కోస్తా ఆంధ్ర బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ భవాన్‌చౌదరి, డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, గుంటూరు బ్రాంచ్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

నేటి జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

టంగుటూరు, సెప్టెంబరు 21 : మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా తూర్పునాయుడుపాలెంలో ఆదివారం జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఐటీ, నాన్ ఐటీకి సంబంధించిన 60 కంపెనీలు వస్తాయని వారు పేర్కొన్నారు.

నేడు దామచర్ల 17వ వర్ధంతి

తూర్పునాయుడుపాలెం రానున్న ముగ్గురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు

కొండపి, ఒంగోలు నియోజకవర్గాల్లో పలు కార్యక్రమాలు



మల్లవరప్పాడులో విగ్రహవిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి)/టంగుటూరు: ఉమ్మడి రాష్ట్ర మాజీమంత్రి దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి ఆదివారం జరగనుంది. ఈ సందర్భంగా ఆయన ప్రాతినిధ్యం వహించిన కొండపి నియోజకవర్గంతోపాటు ఒంగోలులోనూ పలు కార్యక్రమాలను ఇటు కుటుంబసభ్యులు, అటు తెలుగు తమ్ముళ్ల నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి ఆంజనేయులు స్వగ్రామమైన తూర్పునాయుడుపాలెంలో భారీ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆంజనేయులు మనమడైన టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య ఆధ్వర్యంలో నాయుడుపాలెంతోపాటు కొండపి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో వర్ధంతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఒంగోలు నగరంలో ప్రస్తుత ఎమ్మెల్యే, ఆంజనేయులు మరో మనమడు దామచర్ల జనార్దన్ నేతృత్వంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తూర్పునాయుడుపాలెంలో భారీ జాబ్‌మేళా, మెగా వైద్య రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు మూడు వేల మందికి ఉద్యోగ కల్పన లక్ష్యంగా దాదాపు 60కంపెనీల ప్రతినిధులను ఆహ్వానించి జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా సుమారు రూ.4.50కోట్లతో తూర్పునాయుడుపాలెంలో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్, మరో రూ.60 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే మల్లవరప్పాడులో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రులు ఆనగాని సత్య ప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామిలతోపాటు మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

అవీ..ఇవీ..

సినిమాహాలు ప్రారంభానికి అనుమతి కోసం వినతి

మద్దిపాడు, సెప్టెంబరు 21: వెల్లంపల్లి పంచాయతీ పరిధిలో నిర్మాణం పూర్తయిన జేఎంఆర్ సినిమాహాలు ప్రారంభానికి, ఈ నెల 27న దేవర సినిమా ప్రదర్శనకు అధికారులు అనుమతి ఇవ్వాలని సినిమాహాలు యాజమాన్యం శనివారం మద్దిపాడులో మండల విస్తరణాధికారి కొండపి రఘుబాబుకు వినతిపత్రం ఇచ్చారు. తమకు వివిధ శాఖలకు చెందిన అధికారుల అనుమతులు ఉన్నాయని తెలిపారు. అనంతరం మండల విస్తరణాధికారి మాట్లాడుతూ ప్రస్తుత నిబంధనల ప్రకారం సినిమాహాలుకు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) అనుమతులు పొందిన తర్వాతే ప్రారంభించాలని సూచించారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21 : కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం జరిగిన కార్మిక సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రమే నడిపేలా రాష్ట్ర ప్రభుత్వం వత్తిడి చేయాలని తదితర డిమాండ్లతో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో నినదించాలని తీర్మానించారు. అన్ని కార్మిక సంఘాలు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ, సంయుక్త కిసార్ మోర్చా నాయకులు చుండూరి రంగారావు, జి.శ్రీనివాసరావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

సంతనూతలపాడు, సెప్టెంబరు 21: ఎండ్లూరు పంచాయతీ పరిధిలోని బొమ్మినేనివారిపాలెంలో పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు కొమ్మాలపాటి శ్రీరామ్మూర్తి తన భార్య జన్మదినం సందర్భంగా శనివారం విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 21: మండలపరిధిలోని చిలకపాడు, వేములపాడులో అంగనవాడీ సిబ్బంది శనివారం పౌష్టికాహార మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మావతి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఎ.వేములపాడు సూపర్‌వైజర్ శేషరావు, ఏఎన్ఎం పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంతనూతలపాడు, సెప్టెంబరు 21: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎండ్లూరు వద్ద గల ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళాసాధికర కేంద్రంలో మూడు నెలల పాటు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ అధికారి జె.రవితేజయాదవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 15-45 సంవత్సరాలలోపు గల నిరుద్యోగ మహిళలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9963005209 సెల్‌నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు సెప్టెంబరు 21: కౌలురైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు శనివారం ఉప్పుగుండూరు సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తుండగా రైతులు వ్యవసాయం కోసం బ్యాంకులు, ప్రైవేటు వ్యక్తుల వద్దకు రుణాల కోసం పరుగులు తీస్తున్నారన్నారు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు అందించాలని, కౌలురైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జె.జయంతిబాబు, తూబాటి శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, కాకాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

26న జనసేన పార్టీలో చేరిక : రవిశంకర్



కంది రవిశంకర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21: మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈనెల 26న పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు రవిశంకర్ గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ కంది రవిశంకర్ తెలిపారు. ఒంగోలులోని రవిప్రియ హాలులో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఆశయాలు నచ్చి జనసేనలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు సుంకర సాయిబాబా పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి



నగదును అందిస్తున్న మాధవరావు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 21: సమాజంలోని తోటి వారికి సేవ చేయటంలో ఎంతో సంతృప్తి ఉంటుందని శ్రీఅభయ కళారాధన సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు డాక్టర్ మద్దాలి మాధవరావు పేర్కొన్నారు. జేవైసీ యూత్ ఆధ్వర్యంలో చీమకుర్తిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పేద విద్యార్థిని రమ్యకి రూ.2వేల నగదు అందజేసి, పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవైసీ యూత్ కేక్ కట్ చేసి మాధవరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఆలూరి చిరంజీవి, చంద్రశేఖర్, డేవిడ్, ప్రభాకర్, ఆలూరి వెంకటరావు, చిన్న, కిషోర్, నాని పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పరామర్శ



నాగార్జునను పరామర్శిస్తున్న వీరయ్యచౌదరి

నాగులుప్పలపాడు సెప్టెంబరు 21 : ఉప్పుగుండూరు గ్రామంలోని జగ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు కొలకలూరి నాగార్జున కుమార్తె సునీత ఇంటర్ చదువుతూ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతి చెందింది. దీంతో తీవ్ర విషాదంలో ఉన్న నాగార్జున కుటుంబ సభ్యులను శుక్రవారం రాత్రి మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు తేళ్ల మనోజ్‌కుమార్, తెలుగురైతు అధ్యక్షులు ఇంటూరి శ్రీనివాసరావు, ఐటీడీపీ మండలాధ్యక్షులు బెల్లం వెంకటేశ్వర్లు పరామర్శించి తమ సంతాపాన్ని తెలిపారు.

బి.నిడమానూరు పాఠశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ప్రమోద

నాగులుప్పలపాడు సెప్టెంబరు 21 : మండలంలోని బి.నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జీసీడీవో జి.ప్రమోద శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన స్టేషనరీ, ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో పరీక్షలు నిర్వహించి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం కరీంసాహెబ్, ఎన్.సుజికుమారి, డాక్టర్ బక్కమంతల వినయ్, లాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

వేలం కేంద్రానికి నీటి వసతి

కొండపి,సెప్టెంబరు21: కొండపిలోని పొగాకు వేలం కేంద్రానికి రామతీర్థం తాగునీటి ప్రాజెక్ట్ నుంచి నీటి వసతి ఏర్పాటు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు చొరవతో రైతులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. కొళాయిలను వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు నన్నూరి సుబ్బరామయ్య, చింతల వెంకటరావు, షేక్ ఖాజాషా, యనమద్ని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు

• ఉత్సాహంగా పాల్గొన్న టీడీపీ శ్రేణులు





చీమకుర్తిలో కేక్‌లు కట్ చేస్తున్న కందిమళ్ల గంగాధరరావు, పూనాటి వెంకట్రావు, గొట్టిపాటి రాఘవరావు



మద్దిపాడులో కేక్ కట్ చేస్తున్న జయంత్‌బాబు, నాగేశ్వరరావు

సంతనూతలపాడు, సెప్టెంబరు 21: సంతనూతలపాడు నియోజవర్గంలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరిగాయి. సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్థానిక బాపట్లబజారులోని శ్రీఅంకాళమ్మ తల్లి ఆలయంలోను, బాపట్లపార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి ఆర్.అంకారావు ఆధ్వర్యంలో కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు, తన్నీరు శ్రీను శ్రీరామ్మూర్తి, వి.రాఘవ, ఆర్.సురేష్, ఎన్.సుబ్బారావు, పోలిశెట్టి, శ్రీను, ఆనంద్, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మైనంపాడులోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నేత మాదాల నరసయ్య, బీజేపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాదాల రవి, మన్నం వెంకట్రావు, కరిచేటి నరసింహారావు, మాదాల రాంబాబు, ఉప్పలపాటి ప్రభాకర్, మాదాల సురేష్, సర్పంచ్ దాట్లరమణమ్మ, ఉపసర్పంచ్ జి.సుబ్బారావు నాయకులు ఆళ్లఅవినాష్, ఎ.నాగరాజు, పి.రాము, యు.శ్రీను, బ్రహ్మయ్య, తిరుపతిస్వామి, రవీంద్ర, రామాంజనేయులు, వెంకట్రావు పాల్గొన్నారు. అలాగే పి.తక్కెళపాడులో జరిగిన వేడుకల్లో నలమోతు శ్రీనివాసరావు, బాలయ్య నరసింహారావు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మైనంపాడు టీడీపీ కార్యాలయంలో..

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను మద్దిపాడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు నాగన్నపాలెం సర్పంచ్ కాకర్ల విజయ్‌కుమార్, మండవ గోపీనాథ్, దేవబత్తిన ప్రసాద్‌రావు, పాటిబండ్ల అజయ్‌బాబు, బూరేపల్లి సర్పంచ్ రాయపాటి వెంకటశేషయ్య, గోరంట్ల చిరంజీవి, ముత్తనపల్లి రామలింగయ్య, ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గాభవాని, మార్నేని కృష్ణారావు, మార్నేని సుబ్బారావు, మండవ గోవిందరాజులు, రావి ఉమామహేశ్వరరావు, నర్రా సురేష్, ముల్లూరి మురళి, కడియాల రఘుబాబు, వేల్పుల నాగరాజు, సుద్దపల్లి అనిల్, సుద్దపల్లి నరసింహారావు, రెబ్బవరపు ప్రభాకర్‌రావు, గంగవరపు జోసఫ్, దాసరి అక్కయ్య, దుద్దుకూరి డేవిడ్, దేవరపల్లి హనుమంతరావు, ఎద్దు రాంబాబు, సర్పంచులు కాకర్ల విజయ్‌కుమార్, చిట్టిబోయిన అనిల్‌కుమార్‌యాదవ్, రావి నరసింహారావు, యాసం శ్రీనివాసరావు, దేవబత్తిన ప్రసాదరావు పాల్గొన్నారు.

పెదకొత్తపల్లిలో పోతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీఎన్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సర్పంచ్ కాకి శైలజ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతినేని బుచ్చయ్యచౌదరి, మండవ వెంకటేశ్వర్లు, పీఎస్ఆర్ యూత్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి: ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు చీమకుర్తిలో శనివారం టీడీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎస్‌కేఆర్ మానసిక వికాసకేంద్రలో మాజీ వైస్ ఛైర్మన్ కందిమళ్ల గంగాధరరావు, నాయకులు కాట్రగడ్డ రమణయ్య ఎస్‌కే.రఫీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రముఖ వైద్యులు బందా రాహుల్, రమాలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు గోరంట్ల చెన్నయ్య, గొల్లపూడి కోటేశ్వరరావు, ముప్పూరి చలమయ్య, ఉన్నం సుబ్బారావు, రావిపాటి రాంబాబు, సూరంపల్లి హనుమంతరావు, కొత్రపు రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, అవిశినేని వెంగన్న, రామినేని యేగయ్య పాల్గొన్నారు.

పూనాటి వెంకట్రావు ఆధ్వర్యంలో..

చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలో టీడీపీ నేత పూనాటి వెంకట్రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీఎన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, ఉపాధ్యక్షులు మన్నం ప్రసాద్, పట్టణ అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, ఉన్నం సుబ్బారావు, గంగాధరరావు, రావిపాటి రాంబాబు, ముప్పూరి చలమయ్య, సూరంపల్లి హనుమంతరావు, యడ్లపల్లి సురేష్, వెంగన్న పాల్గొన్నారు. ఇక గాడిపర్తివారిపాలెం తదితర గ్రామాల్లో బీఎన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఉప్పుగుండూరులోని అంబేడ్కర్‌నగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల ఎస్సీ సెల్ నాయకులు తెలగతోటి జాన్సన్ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శవనం వసంతరావు, తెలగతోటి పృథ్వి, జూపూడి బాబురావు, గోగులమూడి సింగరయ్య, కందుల రాజేష్, కోండ్రు ఆశీర్వాదం, దొడ్డా స్టాలిన్, గోగులమూడి పరిశుద్ధరావు, కందుల బుచ్చిబాబు, టి.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు(కల్చరల్): సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఒంగోలు నగరం అన్నవరప్పాడులోని శివం నిత్యాన్నదాన శరణాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. చీమకుర్తి పట్టణ తెలుగుదేశం నాయకులు యడ్లపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలోని పేద విద్యార్థినులకు సైకిళ్లు, శరణాలయంలోని వృద్ధులకు వస్త్రాలను అందజేశారు. 300 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో చీమకుర్తి టీడీపీ నాయకుడు ముప్పూరి చలమయ్య, మారెళ్ల సుబ్బారావు, శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, కూరాకుల కరుణాకర్‌రెడ్డి, యడ్లపల్లి సురేష్, యలమంచిలి నాగేశ్వరరావు, ఉన్నం మురళి, గుడిపూడి అనిల్, లోకేష్, ఎం. చౌదరి, నాగరాజు పాల్గొన్నారు.

జీవో85ను వెంటనే రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యాధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21: పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోనెంబరు 85ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాహుల్, ఖాదర్‌మస్తాన్‌బీ డిమాండ్ చేశారు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. జీవో 85 కారణంగా వైద్యాధికారులు ఉన్నత విద్యను చదివేందుకు ఆటంకంగా ఏర్పడిందన్నారు. ఆ జీవోను రద్దు చేయాలని వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సదరు జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

• డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్



డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశావర్కర్లు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21: ఆశా వర్కర్ల సమస్యలను తన పరిధిలోని అంశాలను వెంటనే పరిష్కరిస్తానని డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం ఆశావర్కర్ల సమావేశం అనంతరం వారి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆశాల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ వాణిశ్రీ, డీపీఎంవో సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు ఆటల పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొండపి, సెప్టెంబరు21: అండర్-17 విభాగంలో బాలికలకు కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, చెస్ పోటీలను శనివారం కె.ఉప్పలపాడులోని జడ్పీస్కూల్ ఆవరణలో మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పి. రామారావు, క్రీడల మండల కన్వీనర్ ఎ. రవికిరణ్, హెచ్ఎం సుసన్నకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీవీఆర్‌-చౌదరి జీవితం యువతకు ఆదర్శం

• సంతాపసభలో పలువురు వక్తలు



చౌదరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21 : కార్మిక సంఘం నాయకుడిగా, సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శిగా, కళాకారుడిగా, యువజననేతగా, విద్యార్థి సంఘం నాయకుడిగా పేదలు, కార్మికవర్గం కోసం పని చేసిన ఆదర్శనీయుడు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పీవీఆర్.చౌదరి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని చెప్పారు. ఇటీవల మృతి చెందిన పీవీఆర్.చౌదరి సంతాప సభ శనివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ సీనియర్ నేత ఉప్పుటూరి ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంత కోసం కట్టుబడిన వ్యక్తి చౌదరి అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చౌదరి నిరంతరం పనిచేశారని, అటువంటి వంటి వ్యక్తి మృతి చెందడం బాధాకరమన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ.సుబ్బారావు మాట్లాడుతూ చిరకాల మిత్రుడిని కోల్పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణమూర్తి, కరవది సుబ్బారావు, ఎంసీ వెంకటేశ్వర్లు, స్వామి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జీవీ.కొండారెడ్డి, కె.వీరారెడ్డి, చుండూరి రంగారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, చావలి సుధాకరరావు, కందుకూరి సుభాన్‌నాయుడు, వైవీ.సుబ్బారావు, కామేపల్లి శ్రీనివాసరావు, టి.అరుణ, కె.అంజయ్య, చీకటి శ్రీనివాసరావు, అంజిబాబు, శ్రీరామ్ శ్రీనివాసులు, భూదూరి హరికృష్ణ, ఎ.సురేష్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కనకయ్య, సురేష్ పాల్గొన్నారు.

సముద్రతీరాన్ని బాధ్యతగా కాపాడుకోవాలి

మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి • ఘనంగా అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవం • భారీగా తరలివచ్చిన విద్యార్థులు





స్వచ్ఛసాగర్ కార్యక్రమంలో పాల్గొన్న జేడీ చంద్రశేఖరరెడ్డి, పలు సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు

కొత్తపట్నం(ఒంగోలునగరం) సెప్టెంబరు 21: సముద్ర తీర ప్రాంతం కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొత్తపట్నం పల్లెపాలెం సముద్ర తీరంలో స్వచ్ఛసాగర్-సురక్షితసాగర్ కార్యక్రమం నిర్వహించారు. మత్స్యకార సంక్షేమ సమితి, హైదరాబాద్‌కు చెందిన ఇన్ కాయిస్ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని తీరంలో తీరంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జేడీ చంద్రశేఖరరెడ్డి, జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి బెన్‌హర్, ఒంగోలు శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ సముద్రసంపదను ప్లాస్టిక్ వ్యర్థాలు దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర జలాలు కూడా కలుషితం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త వేదుల చంద్రశేఖర్, మత్స్యకారసంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి సున్నపు తిరుపతిరావు, సర్పంచ్ ఆనందరావు, ఎంపీటీసీ నరసింహారావు, బీచ్ ఇన్‌చార్జి రేవు చలపతివర్మ పాల్గొన్నారు.

తీరంలో విద్యార్థుల 'స్వచ్ఛసాగర్'

అంతర్జాతీయ తీర ప్రాంత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొత్తపట్నం జడ్పీ హైస్కూలు విద్యార్థులు స్వచ్ఛసాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 208 మంది విద్యార్థులు సముద్ర తీర ప్రాంతంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ తన్నీరు బాలాజీ, ట్రైనింగ్ కమిషనర్ కేవీ.శేషారావు, జిల్లా కోశాధికారి పర్రె వెంకటరావు, ఫ్లాక్ లీడర్ కె.పద్మశ్రీ, స్కౌట్ మాస్టర్ చక్కా కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు బాలాజీ, సురేంద్రబాబు, నరసింహారావు, వెంకటకృష్ణయ్య, శేషగిరి, చంద్రశేఖర్, శ్రీవాణి విద్యానికేతన్, ఒంగోలు ఏకేవీకే కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

25న పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు : డీఈవో

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21 : పాఠశాలల్లో ఈనెల 25న జరగనున్న పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని డీఈవో సుభద్ర కోరారు. ఈ మేరకు పోస్టర్లను శనివారం స్థానిక డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. డీడీ సుబ్బారావు, జేవీవీ నేతలు జయప్రకాష్, రంగారెడ్డి, లక్ష్మీనారాయణ, ఆర్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

24న నగరంలో కళారూపాలతో భారీ ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాకారులు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 21: ఒంగోలు నగరం ఈ నెల 24వ తేదీన అగ్రస్థాయి కళాకారులు, కళారూపాలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అఖిల ప్రజా కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోను దుర్గ తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సామాజిక చైతన్యం-కళాకారుల సంక్షేమం అనే ఆశయంతో తమ సంఘం ఏర్పడిందని, రాష్ట్రంలోని కళాకారులందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి విధివిధానాలు రూపొందిస్తామన్నారు. విజయవాడ వరద బాధితుల సహాయం కోసం 24న మధ్యాహ్నం మూడు గంటల నుంచి కర్నూల్‌రోడ్ ఫ్లైఓవర్ నుంచి అంబేడ్కర్‌భవన్ వరకు వివిధ కళారూపాల ప్రదర్శనతో భారీ ర్యాలీ జరుగుతుందని, సాయంత్రం 6 గంటల నుంచి అంబేడ్కర్‌భవన్‌లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బెనిఫిట్ షో ఉంటుందన్నారు. కళాకారులు, కళాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని దుర్గ కోరారు. సమావేశంలో ధేనువకొండ వెంకటసుబ్బారావు, ఏల్చూరు అనంతలక్ష్మి, తాళ్లూరి శ్రీదేవి, యు.లక్ష్మీతులసి, కోటేశ్వరరావు, ఎస్‌కే.బాబు, ఇర్మియ, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మైనంపాడు హైస్కూలుకు మైక్‌సెట్ అందజేత



మైక్‌సెట్‌ను అందిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

సంతనూతలపాడు, సెప్టెంబరు 21: ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా మైనంపాడు జడ్పీహైస్కూల్‌కు రోటరీక్లబ్ ఆఫ్ చీమకుర్తి ప్రతినిధి మన్నం నాగరాజు మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ చీమకుర్తి అధ్యక్ష, కార్యదర్శులు కె.రామాక్రిష్ణ, కె.సుధాకర్, ఎం.చలమయ్య, సురేష్, ఎస్ఎంసీ చైర్మన్ బ్రహ్మయ్య, జి.సుబారావు, హెచ్ఎం నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు పాకల విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయుడు

సింగరాయకొండ, సెప్టెంబరు 21 : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌కి చెందిన 10 మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి జూడో పోటీల్లో ప్రతిభకనబరిచి అండర్-14 విభాగంలో వి. హిందు, వి. దివ్య, వి. కుమారి, సీహెచ్.సంతోషి, ఎస్.వలరలక్ష్మి, బాలుర విభాగంలో కె. యశ్వంత్, బి. రేవంత్, సీహెచ్.కిషోర్, సీహెచ్. తిరుమల, వి. ప్రసన్నకుమార్ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 22 నుంచి 24 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం డీవీఎస్.ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు హజరత్తయ్య అభినందించారు.

'రెండు రోజుల్లో నీళ్లిస్తాం'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొండపి,సెప్టెంబరు21: 'తాగునీరు లేని మూగచింతల' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్.జ్యోతి స్పందించారు. గ్రామంలోని తాగునీటి పైపులైనుపై విద్యుత్‌లైను వేయడం వల్ల పైపులకు డ్యామేజీ జరిగిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం లీకులను పూడ్చామని, మరో రెండు లీకులు ఉన్నాయని, వాటిని కూడా పూడ్చి సోమవారం నుంచి ప్రజలకు తాగునీరిస్తామని ఆమె వివరించారు.

ప్రతి కార్మికుడూ పని చేయాల్సిందే..!

కార్పొరేషన్‌లో ప్రక్షాళన ప్రారంభం ● పారిశుధ్య విభాగంలో మేస్త్రీ వ్యవస్థ రద్దు ● కమిషనర్ వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 21 : ఒంగోలు నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో ప్రక్షాళన మొదలైంది. గత వైసీపీ హయాంలో శానిటరీ వర్కర్‌గా విధుల్లోకి చేరి, వైట్‌కాలర్ జాబ్ పేరుతో మేస్త్రీలుగా కొనసాగుతున్న వ్యవస్థకు కమిషనర్ వెంకటేశ్వరరావు ఫుల్‌స్టాప్ పెట్టారు. నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యం, మేస్త్రీలుగా, అనధికార అటెండర్లుగా చీపురు పట్టకుండా కొనసాగుతున్న వారిని పనిచేయాలని కమిషనర్ కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయలో ప్రజారోగ్యఅధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. అలాగే శానిటేషన్‌లో పనిచేసేవారు తక్కువ, పెత్తనం చేసేవారు ఎక్కువ అయ్యారని పేర్కొన్నారు. అయితే కార్మికులను ఎవరినీ తొలగించబోమని, కానీ ఇకపై మేస్త్రీ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. పర్యవేక్షులుగా ఒక హెల్త్ ఆఫీసర్, ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అన్ని సచివాలయాలలో 70మంది శానిటరీ సెక్రటరీలు ఉన్నారని అన్నారు. మేస్త్రీ వ్యవస్థను రద్దు చేసి, పూర్తిస్థాయిలో కార్మికులు పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇప్పటి వరకు మేస్త్రీగా ఉన్నందున ఆ డివిజన్‌లో వర్కర్‌గా పని చేయాలంటే కొంచం ఇబ్బందికరమేని, అందుకోసం ఇతర డివిజన్‌లోకి వెళ్లాలని సూచించారు. లేదంటే నైట్ శానిటేషన్‌లో వర్కర్‌గా వెళ్లొచ్చని, మూడవ అవకాశంగా స్పెషల్ శానిటేషన్ టీమ్‌లో పనిచేయవచ్చని కమిషనర్ తెలిపారు. ఈ విధానం ఆదివారం నుంచే అమలులోకి వస్తుందన్నారు. దీనిపై శానిటేషన్ అధికారులు అందరు దృష్టి సారించాలన్నారు. మొదటి దశలో ఆప్కాస్‌లో 70 మంది, కొవిడ్ విధుల్లో చేరిన వారిలో 36 మంది మొత్తం 106 మంది మేస్త్రీలను ఆ విధుల నుంచి తొలగించి కార్మికులుగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రెండో విడతగా అన్ని సెక్షన్‌లలో త్వరలోనే ప్రక్షాళన చర్యలు ఉంటాయని కమిషనర్ స్పష్టం చేశారు.

520 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

టంగుటూరు, సెప్టెంబరు 21 : గుంటూరు జిల్లా వడ్లమూడి నుంచి తమిళనాడులోని మధురైకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని వల్లూరు సమీపంలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ కులశేఖర్ ఆదేశాల మేరకు శనివారం ఒంగోలు విజిలెన్స్ అధికారులు, పౌరసరఫరాల అధికారులు వల్లూరు సమీపంలో మాటు వేశారు. జాతీయ రహదారిలో అటుగా వస్తున్న లారీని ఆపి తనిఖీ చేయగా అందులో 520 రేషన్ బియ్యం బ్యాగులు ఉన్నాయి. వాటిని బ్రోకెన్ రైస్‌గా కన్వర్ట్ చేసి రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లారీలోని రేషన్ బియ్యం వడ్లమూడిలోని శ్రీలక్ష్మి శ్రీనివాస ట్రేడర్స్ మిల్లునుంచి తమిళనాడులోని మధురైకి తరలిస్తున్నట్లు విచారణ ద్వారా కనుగొన్నారు. పట్టుబడ్డ రేషన్ బియ్యంతోపాటుగా వాహనాన్ని సీజ్ చేశారు. లారీ యజమాని, డ్రైవర్, మిల్లు ఓనర్‌పై టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సింగరాయకొండ ఎంఎల్ఎస్ పాయింట్‌కు చేర్చి, లారీని టంగుటూరు స్టేషన్‌కు తరలించారు.

24నుంచి 'పొలం పిలుస్తోంది' ప్రారంభం : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జిల్లాలో ఈనెల 24నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం వారంలో రెండు రోజుల పాటు జరుగుతుందన్నారు. మంగళ, బుధవారాల్లో జిల్లాలోని అన్ని మండలాల్లో అనిన గ్రామాల్లో నిర్వహిస్తారని, ఒక రోజు ఉదయం పొలాలు పరిశీలన, చీడపీడలు గుర్తించడం, మధ్యాహ్నం వాటిపై రైతులకు శాస్త్రవేత్తలతో ముఖాముఖి జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. రెండో రోజు ఆర్‌బీకే పరిధిలో ఈ విధంగానే కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో డీఏవో శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముసికి సాగర్‌నీటి కోసం 25న కొండపిలో సదస్సు

టంగుటూరు, సెప్టెంబరు 21 : ముసికి సాగర్ నీటి కోసం రైతు, వ్యవసాయ కార్మిక , రైతు కూలీ సంఘాలు కార్యాచరణకు రంగంలో దిగాయి. ఈవిషయాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు వీలుగా ఈ నెల 25న నియోజకవర్గ కేంద్రమైన కొండపిలో సదస్సు నిర్వహిస్తున్నారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈసదస్సులో ముసికి సాగర్ నీటి సాధనకు చేయవలసిన ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు రైతు నాయకులు వెల్లడించారు. శనివారం టంగుటూరు యూటీఎఫ్ కార్యాలయంలో సమావేశమైన రైతు , రైతు కూలీ సంఘాల నేతలు సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రైతు సంఘం నాయకులు వేజండ్ల సింగయ్య, రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు, నత్తల నాగరాజు, ప్రజాసంఘాల నాయకులు బొడ్డు సతీష్, టి ప్రభాకర్, టి. రాము, వి. మోజెస్, జి.వెంకట్రావు, తన్నీరు సుబ్బారావు, ఎస్‌కె మీరాస్, గడ్డం సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లర సమస్య పరిష్కారం కోసం నాణేల పంపిణీ : ఏజీఎం

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21 : చిల్లర సమస్యను దృష్టిలో పెట్టుకొని ఖాతాదారులకు, ప్రజలకు నాణేములను పంపిణీ చేస్తున్న యూనియన్ బ్యాంకు ఏజీఎం రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద ఉన్న యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం చిల్లర నాణేల పంపణీ కార్యక్రమం రీజనల్ హెడ్ రవి కుమార్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు రూ.7లక్షలపైగా ప్రజలకు చిల్లకు అందించారు. అనంతరం కరెన్సీ చెస్ట్ మేనేజర్ టి.పోలయ్య మాట్లాడుతూ చిల్లర నాణేలు అవసరమైన ఖాతాదారులు ఎప్పుడైనా కోర్టుసెంటర్‌లోని కరెన్సీ చెస్ట్ వద్ద లేదా యూనియన్‌బ్యాంకు అన్ని శాఖల వద్దకు వెళ్ళి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బాపూజీ కాంప్లెక్స్ మేనేజర్ బి.సైదయ్య, అధ్యక్ష, కార్యదర్శులు టి.వెంకటచలమయ్య గుప్తా, కె.సురేష్‌కుమార్, సభ్యులు బి.రామ్‌సింగ్, బి.మాధవరావు తదితరులు పాల్గొన్నారు. కాగా చిల్లర నాణేల కోసం ఒక్కసారిగా ప్రజలు, చిరువ్యాపారులు ఎగబడటంతో కొద్దిసేపు తోపులాట జరిగింది. అనంతరం వరుస క్రమంలో చిల్లరను బ్యాంకు సిబ్బంది పంపిణీ చేశారు.

బీసీ హాస్టళ్ల సహాయ సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21 : మార్కాపురం బీసీ హాస్టళ్ల సహాయ సంక్షేమ అధికారి ఎస్‌కే. జబ్బార్ అవినీతి, అక్రమాలపై సమగ్రవిచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, డైఫీ నాయకులు విజయ్, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ తిరుపతిరావు మాట్లాడారు. గత వారం రోజులుగా జబ్బార్ అవినీతి, అక్రమాలపై నిరసన చేస్తున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. హాస్టళ్లలో మహిళా వర్కర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతన్నారని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ఏడు నెలలుగా వర్కర్లకు ఉద్దేశపూర్వకంగా జీతాలు అడ్డుకుంటున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణంగా ఉందని మండపడ్డారు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్ళిన నిమ్మకునిరేత్తినట్లుగా వ్యవహరించడాన్ని ఖండించారు. కలెక్టర్ ఆయా వసతిగృహాలను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన

సింగరాయకొండ, సెప్టెంబరు 21 : సింగరాయకొండ పంచాయతీ పరిధి రైల్వేస్టేషన్ రోడ్డులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులకు క్యాన్సర్‌పై ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నూకసాని సుబ్బారావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించినట్లయితే నివారణ సులభమతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహాలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 21: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, రమణయ్య పేర్కొన్నారు. శనివారం బి.నిడమానూరు జడ్పీ హైస్కూలులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 ఆటల పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని 8 పాఠశాలల నుంచి 300మంది పాల్గొన్నట్లు స్కూల్ గేమ్స్ మండల కార్యదర్శి, పీడీ గడ్డం వెంకట్రావు తెలిపారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, షటిల్ పోటీలను నిర్వహించారు. సోమవారం కూడా ఆటల పోటీలు జరుగుతాయని పీడీ చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం అబ్దుల్‌కరీంసాహెబ్, వినయ్ పాల్గొన్నారు.


ఘనంగా గురజాడ జయంతి

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 21: అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు 162వ జయంతిని శనివారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ, కళామిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పలువురు సాహితీవేత్తలు, సిబ్బంది పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ అంటరానితనం, కన్యాశుల్కం, బాల్యవివాహం వంటి దురాచారాలపై తన రచనల ద్వారా పోరాటం చేసిన మహనీయుడు గురజాడ అప్పారావు అని కొనియాడారు. కార్యక్రమంలో నూనె అంకమ్మరావు, నాగభైరవ ఆదినారాయణ, తేళ్ల అరుణ, కుర్రా ప్రసాద్‌బాబు, బొమ్మల కోటేశ్వరి, సింహాద్రి జ్యోతిర్మయి, సంతవేలూరి కోటేశ్వరరావు, గుంటూరు సత్యనారాయణ, మిడసల మల్లిఖార్జునరావు, ధేనువకొండ సుబ్బారావు, నాళం నరసమ్మ, ఎం.సూర్యకుమారి, కె.సంపూర్ణమ్మ, పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

ఒంగోలు(కలెక్టరేట్): గురజాడ అప్పారావు జయంతిని శనివారం స్థానిక చైతన్యనగర్‌లో నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి, బి.పెద్దగోవిందమ్మ, ఇంద్రజ్యోతి, కె.రాజేశ్వరి, మధురవాణి, అనిత, పి.శైలజ, తిరుపతమ్మ, నాగమణి, సుబ్బులు, అనితా కుమారి, శిరీష పాల్గొన్నారు.

విద్యార్థులంతా క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి



విజేతలకు పతకాలను ప్రదానం చేస్తున్న జయంత్‌బాబు

టంగుటూరు, సెప్టెంబరు 21 : గెలుపోటములు ప్రధానం కాదని, విద్యార్థులంతా క్రీడాస్ఫూర్తి అలవరచుకోవాలని మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా పోటీలు టంగుటూరులో శనివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జయంత్‌బాబు విజేతలను అభినంది మెడల్స్‌ను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నేత దామచర్ల శ్రీధర్, ఎంఈవో చెంచుపున్నయ్య, మండల కోఆర్డినేటర్ యరమాల అరుణ, హెచ్ఎం తులసిప్రభ, స్టాఫ్ సెక్రటరీ యాకోబు, కొండపి నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ తులిబిల్లి అశోక్‌బాబు, పీడీలు మోహన్, వెంకట్రావు, ఉష, కౌస్య, జయలక్ష్మి, ఎం.వెంకట్రావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

టీవీ యాంకర్‌పై వేధింపులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 21: ఒంగోలులోని లోకల్ టీవీలో న్యూస్‌రీడర్‌గా, యాంకర్‌గా పనిచేస్తున్న ఓ మహిళపై ఇరువురు వ్యక్తులు వేధింపులకు పాల్పడుతున్నారు. పతకమూరి సుబ్రమణ్యం, దాసరి సుబ్రహ్మణ్యం ఆమె వెంట పడుతుండటమే కాకుండా తమతో ఫోన్‌లో మాట్లాడకపోతే నీ అంతు చూస్తామని బెదిరిస్తున్నారని బాధితురాలు వన్‌టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు



యువకుడిని కాపాడి ఒడ్డుకు తీసుకొస్తున్న కానిస్టేబుల్

సింగరాయకొండ, సెప్టెంబరు 21 : అలల తాకిడికి సముద్రంలో కొట్టుకుపోతున్న ఒక యువకుడిని విధుల్లో ఉన్న మెరైన్ సిబ్బంది కాపాడారు. ఈ సంఘటన మండలంలోని పాకల సముద్రతీరంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పొన్నలూరు మండలం రావులకొల్లు గ్రామానికి చెందిన కొమ్మగిరి దుర్గారావు గ్రామస్థులతో కలిసి గణేష్ విగ్రహాన్ని నియజ్జనం చేసేందుకు పాకల తీరానికి వచ్చారు. తీరంలో గ్రామస్థులతో కలిసి సముద్ర స్నానం చేస్తుండగా అకస్మాత్తుగా అలల ఉధృతికి లోపలికి కొట్టుకుపోయాడు. వెంటనే సముద్రస్నానం చేస్తున్న గ్రామస్థులు కేకలు పెట్టారు. వెంటనే తీరంలో విధుల్లో ఉన్న మెరైన్ సిబ్బంది పి. రాజేష్, కె. మస్తానయ్య అప్రమత్తమై సముద్రంలోకి వెళ్లి దుర్గారావును రక్షించి ఒడ్డుకు చేర్చారు. సకాలంలో స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన మెరైన్ సిబ్బందిని రామాయపట్నం మెరైన్ సీఐ జి. శివన్నారాయణ, ఎస్సై మస్తాన్‌షరీఫ్ అభినందించారు.

ఇసుక టిప్పర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు



ఇసుక టిప్పర్‌ను అడ్డుకున్న మడనూరువాసులు

కొత్తపట్నం(ఒంగోలునగరం) సెప్టెంబరు 21: సముద్ర తీర ప్రాంతం నుంచి ఒంగోలుకు అక్రమంగా జరుగుతున్న ఇసుక రవాణాను శనివారం ఉదయం మడనూరు గ్రామస్థులు, తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకున్నారు. మండలంలోని మడనూరు, తేటుపురం గ్రామాల నుంచి రాత్రి వేళల్లో ఇసుకను ఒంగోలు, ఇతరప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో తీరంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇసుక రవాణాను ఇంత కాలం చూస్తూ ఊరుకున్న అధికారులు, పోలీసులు ఇటీవల కాలంలో దాడులు చేసి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు, లారీలను పట్టుకుంటున్నారు. అయినా దొంగచాటుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. ఈనేపథ్యంలో మడనూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మన్నం శ్రీనివాసరావు, మేకల జక్రయ్య, బత్తుల శ్రీను, హరికృష్ణ ఇతర గ్రామస్థులతో కలిసి శనివారం ఉదయాన్నే ఇసుక టిప్పర్‌ను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా మడనూరు, ఈతముక్కల వీఆర్వోలు గురుమూర్తి, శంకర్‌కు తెలియజేశారు. అనంతరం టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గురజాడకు నివాళి

సంతనూతలపాడు, సెప్టెంబరు 21: సంతనూతలపాడులోని గ్రంథాలయంలో శనివారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకులు కె.సత్యనారాయణ మాట్లాడుతూ తన రచనల ద్వారా నాటి సమాజంలోని మూఢనమ్మకాలను, దురాచారాలను ప్రశ్నించారని తెలిపారు. అనంతరం నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పొదిలిలో దర్జాగా రోడ్డు కబ్జా

- యథేచ్ఛగా దుకాణాల ముందు మెరకలు
- రహదారి అంచుల ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు



కెనరా బ్యాంకు సమీపంలో రోడ్డుపై అక్రమ నిర్మాణం

పొదిలి, సెప్టెంబరు 21 : పట్టణంలో రోడ్డు అంచులు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి. పట్టణం మొత్తం ఎక్కడ చూసినా 7 మీటర్ల తారురోడ్డు మాత్రమే కనిపిస్తోంది. రోడ్డుకు ఇరువైపుల ఉండాల్సిన 30 అడుగులరోడ్డు కనిపించడం లేదు. ఆ విధంగా ముఖ్యంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు అంచులను యథేచ్ఛగా ఆక్రమించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. బలవంతులదే రాజ్యం అన్న చందంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని నెలవారిగా వేలాది రూపాయలు అద్దె రూపంలో అక్రమార్కులు దిగమింగుతున్నారు. అంతేకాకుండా రోడ్డు అంచులు ఆక్రమించడంతో ప్రధాన రహదారులు సైతం చిక్కి శల్యమౌతున్నాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. కీలక సమయాల్లో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకొని పట్టణ ప్రజలు విలవిల లాడి పోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అదే రీతిలో రెవెన్యూ, నగర పంచాయతీ అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు. దీంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. నగర పంచాయతీగా రూపాంతరం చెందినప్పటి నుంచి పట్టణం విస్తీర్ణం పెరిగిపోయింది. మార్కాపురం అడ్డరోడ్డు నుండి కాటూరివారిపాలెం వరకు ఒంగోలు నంద్యాల జాతీయ రహదారికి ఇరువైపుల ఆక్రమణలకు అంతు లేకుండా పోయింది. డ్రైనేజి వ్యవస్థను సైతం ఆక్రమించుకొని దకాణాలు నిర్వహిస్తుండడంతో కొద్దిపాటి వర్షానికే జాతీయ రహదారి చెరువులను తలిపిస్తోంది. కొంత మంది సొంతంగా వ్యాపారాలు చేసుకంటుండగా మరికొంతమంది అద్దెకు ఇచ్చి నెలవారిగా సొమ్ము చేసుకంటున్నారు. రోడ్డు అంచులు ఆక్రమించుకోవడం తోపాటు ఎత్తుగా మట్టితో మెరక తోలడంతో రోడ్డు పల్లంగా మారి మురుగునీరు సైతం నడిరోడ్డులో ప్రవహిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు అంచులలో ఆక్రమణలు తొలగించి సమస్య లేకుండా చూడాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలో రోడ్డు అంచులో వేసిన వరలు

అవీ..ఇవీ..

దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి

కంభం, సెప్టెంబరు 21 : దూరవిద్య విధానంలో పది, ఇంటర్ చదివేందుకు 2024-25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్ తెలిపారు. శనివారం ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో బి.మాల్యాద్రి అధ్యక్షతన అడ్మిషన్ల ప్రక్రియ, పరీక్ష కేంద్రాల ఎంపిక, నిర్వహణపై ఓపెన్‌స్కూల్ నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. చదువు మధ్యలో ఆపిన వారు మళ్లీ చదువు కొనసాగించేందుకు దూరవిద్య విధానం ఒక వరమన్నారు. ఈ సదావకాశాన్ని మహిళలు, ప్రజా ప్రతినిధులు, వృత్తి, వ్యాపారాల్లో ఉండేవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాల్‌పోస్టర్లను పట్టణంలోని పలు ప్రాంతాల్లో అతికించి అవగాహన కల్పించారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు, సెప్టెంబరు 21 : పట్టణంలోని ఎన్‌జీవో హోంలో గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. తెలుగుభాష అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయుడు, కవి అయిన ఆర్.సుబ్బరాయశర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, యోగా గురువు నారాయణరెడ్డి, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి పిడతల రమేష్‌రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం మూర్తయ్య, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు మల్లారెడ్డి, మురళి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడే వ్యక్తికి ఆపన్నహస్తం

- చెక్కును అందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెం బరు 21 : అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి మెరుగైన చికిత్స కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) చెక్కును అందిం చి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదుకున్నారు. కంభం మండలం చిన్న కంభం గ్రామానికి చెందిన కిల్లా సూర్యనారాయణ కొన్ని రోజులుగా లంగ్స్‌ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని నీమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స చేయించుకునే స్థోమత కుటుంబసభ్యులకు లేదు. దీంతో స్థానికులు వారి పరిస్థితిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వైద్యఖర్చుల కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా రూ.2లక్షలు మంజూరు చేయించి కుటుంబసభ్యులకు అందచేశారు. దీంతో కుటుంబసభ్యులు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.7 లక్షల మంజూరు

- బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేసిన మంత్రి లోకేష్

పుల్లలచెరువు, సెప్టెంబరు 21 : పల్నాడు జిల్లా నీలగంగవరం వద్ద గత నెలలో రోడ్డు ప్రమాదంలో గాయపడి నర్సరావుపేటలో చికిత్స పొందుతున్న తెలుగునాడు నాయకుడు వేముల నాగరాజుకు ప్రభుత్వం అండగా నిలిచింది. వైద్యఖర్చులకు విద్య, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ రూ.7 లక్షల విలువైన చెక్కును అందజేశారు. శనివారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో నాగరాజు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నాగరాజు పరిస్థితిని టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు మంత్రి అంతకు ముందు లోకేష్ దృష్టికి తీసుకుపోయారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, కుటుంబ సభ్యులు వేముల కృష్ణయ్య, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 21: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి పార్క్ వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ నారాయణ మాట్లాడుతూ ఇంటి పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలువల్లో చెత్త వేయరాదన్నారు. పార్క్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మెప్మా ఏపీఎం శిరీష, ఏంజిల్స్ సంస్థ అధ్యక్షుడు రాజు, పీడీఆర్ కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఘటనపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

గిద్దలూరు, సెప్టెంబరు 21 : తిరుమల లడ్డూ పవిత్రతకు భంగం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు స్థానిక తహసీల్దార్ ఆంజనేయరెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. తిరుమల లడ్డూ తయారీలో నిషేధిత నూనెను వినియోగించడం బాధకరమన్నారు. వెంకటేశ్వరస్వామి భక్తుల విశ్వాసానికి భంగం కలిగించిన అధికారులపై, నాటి ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షులు ఎ.ఉదయ్ శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు, మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ తీరును ఖండించిన నేతలు

వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని, టీటీడీని వ్యాపార కేంద్రంగా మార్చారని పలువురు విమర్శించారు. కిసాన్‌మోర్చ రాష్ట్ర నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, బిజెపి నాయకులు బూజుమేకల రాజు, తదితరులు పాల్గొన్నారు.

యువత బీజేపీలో సభ్యత్వం తీసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్ : దేశ అభివృద్ధికి కోసం యువత ముందుకొచ్చి బీజేపీలో సభ్యత్వం తీసుకోవాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏవీ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని దోర్నాల కూడలిలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు చిన్న వీరారావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగరాజు, సురేష్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగల ముఠా అరెస్ట్

- ఐదు బైకులు స్వాధీనం
- పరారీలో మరో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, సెప్టెంబరు 21: మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను మార్కాపురం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.3.60 లక్షల విలువైన ఐదు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పట్టణ పోలీసుస్టేషన్‌లో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ యు.నాగరాజు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన తమడపు సుమంత్ ఈ నెల 14న తన స్నేహితున్ని కలిసేందుకు మోటార్ సైకిల్‌పై మార్కాపురం వచ్చాడు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీ వద్ద మోటార్ సైకిల్‌ను పార్కు చేసి స్నేహితునితో బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూసేసరికి మోటార్ సైకిల్ కనిపించలేదు. ఈ మేరకు మార్కాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో సుమంత్ ఫిర్యాదు చేశాడు. ఈ కేసును ఛేదించేందుకు క్రైం టీమ్‌లను పట్టణ ఎస్సై సైదుబాబు, ట్రైనీ ఎస్సై రాజమోహనరావులు ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సైదుబాబు నాగులవరం రోడ్డులోని ఈద్గా వద్ద మండలంలోని వేములపేట గ్రామానికి చెందిన కొత్రపోలు నాగార్జునరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో తనతోపాటు పట్టణంలోని రాజ్యలక్ష్మి కాలనీనికి చెందిన తిరుమలకొండ ప్రేమ్‌కుమార్, రామలక్ష్మణవీధికి చెందిన వగరుల దుర్గాప్రసాద్, విజయాటాకీస్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మజీద్, షణ్ముక్, శివలు చోరీల్లో పాలుపంచుకున్నట్లు తెలిసింది. దీంతో పోలీసులు షణ్ముక్, శివలు మినహా మిగిలిన వారిని అరెస్ట్ చేశారు. వారిరువురు పరారీలో ఉన్నారు. నిందితుల వద్ద మార్కాపురంతోపాటు కంభం, కొనకనమిట్ల, గిద్దలూరు, చీమకుర్తిల్లో చోరీకి గురైన మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కేసుఛేదనలో ప్రతిభచూపిన సీఐ పి.సుబ్బారావు, ఎస్సై సైదుబాబు, పీఎస్సై రాజమోహనరావు, కానిస్టేబుళ్లు తుర్రా వీరభద్రుడు, షేక్ షరీఫ్, డి.కోటినాయక్‌లకు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు రివార్డులను అందజేశారు.

బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థికి గాయాలు

గిద్దలూరుటౌన్, సెప్టెంబరు 21 : బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థికి ప్రమాదవశాత్తు ఇనుపచువ్వలు తగలడంతో గాయాలయ్యాయి. శనివారం కొమరోలు నుండి గిద్దలూరుకు ఆర్టీసీ బస్సు వస్తుండగా గిద్దలూరు నుంచి ఇనుప గేటు లోడుతో ఆటో వెళుతోంది. ఆ గేటు ఇనుప చువ్వలు బస్సులో ఉన్న ఓ విద్యార్థికి క్రాసింగ్ సమయంలో తగలడంతో గాయాలయ్యాయి. దీంతో విద్యార్థిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ



మొబైల్ అందజేస్తున్న కార్మికురాలు

పొదిలి, సెప్టెంబరు 21 : పట్టణ వీధులను శుభ్రం చేసే ఓ పారిశుధ్య కార్మికురాలు తన నిజాయితీని చాటుకొంది. తనకు దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను మేస్త్రీ ద్వారా బాధితుడికి అందజేసింది. పట్టణంలోని చిన్న బస్టాండ్ సమీపంలో చెత్తను శుభ్రం చేస్తుండగా రాగి చిన్నమ్మి అనే మహిళా కార్మికురాలికి ఇంచుమించు రూ.35 వేల రూపాయల విలువైన మొబైల్‌ఫోన్ దొరికింది. ఈ విషయాన్ని తన మేస్త్రీ కల్యాణ్‌కు తెలియజేసింది. అనంతరం మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు కొత్త ఆంజనేయులును పిలిపించి మొబైల్‌ఫోన్‌ను అందజేశారు. నిజాయితీగా ఫోన్‌లు అందజేసిన చిన్నమ్మిని, మేస్త్రీ కల్యాణ్‌ను పలువురు అభినందించారు.

మహిళా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ఉషశ్రీ

మార్కాపురం, సెప్టెంబరు 21: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సీనియర్ న్యాయవాది ఉషశ్రీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏకలవ్య కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పలు చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఉషశ్రీ, ఆసిఫ్‌ఖాన్‌లు గృహహింస, ఆస్థిలో సమాన హక్కు, మెయింటెనెన్స్ తదితర అంశాలకు సంబంధించి మహిళలకు ఉపయోగపడే చట్టాల గురించి క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఫాస్ట్‌జస్టిస్ సంస్థ అధ్యక్షులు ఏ.రాజు, గురవయ్య, మహిళలు పాల్గొన్నారు.

పాఠశాలలో ఏఎంవో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎంవో రమేష్

తర్లుపాడు, సెప్టెంబరు 21: మండలంలోని సీతానాగులవరం ప్రాథమిక పాఠశాలను జిల్లా ఏఎంవో ఎం.రమేష్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు, మధ్యాహ్న భోజనం పరిశీంచారు. పాఠశాల చుట్టూ పెంచుతున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసులను అభినందించారు. పాఠశాలలో విద్యాబోధన గురించి పలు ప్రశ్నలు వేసి సమాదానాలు రాబట్టారు. నవోదయ ప్రవేశాల పరీక్షకు విద్యార్థులను సంసిద్ధం చేయడంపై అభినందించారు. పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకాలపై సంతృప్తిగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటి వద్ద విద్యాబోధనను తనిఖీ చేసిన ఏఎంవో

మండలంలోని కారుమానుపల్లెలో ఐఈఆర్‌డీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటి వద్ద విద్యా బోధనను ఏఎంవో రమేష్ తనిఖీ చేశారు. విద్యార్థి కంది రామిరెడ్డి విద్యాబోధన తనిఖీ చేశారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయురాలు వనితా జ్యోతిని ఆదేశించారు.

వరద బాధితులకు రూ.35వేల విరాళం

గిద్దలూరు, సెప్టెంబరు 21 : విజయవాడ వరద బాధితుల కోసం దాతల నుంచి రూ.35వేలు సేకరించినట్లు ఆపోపా అధ్యక్షులు దారా రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తాన్ని తమ రాష్ట్ర శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు



మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు), సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు వై.పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం ఎర్రగొండపాలెం పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పట్టణంలోని ముస్లిం బజారులో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో రూ. 3 వేల నుంచి రూ.4 వేల ఫించను పెంపు, నిరుద్యోగులకు మేగా డీఎస్సీ , ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు వంటి సంక్షేమ కార్యక్రమాలకు అందిస్తోందన్నారు. తొలి 100 రోజుల పాలనలో నియోజకవర్గంలో 15 కోట్లతో సీసీ రోడ్డులు మంజూరయ్యాయని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలో హాస్టల్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేయించామని అన్నారు. నియోజకవర్గంలో జాబ్‌మేళ నిర్వహించామన్నారు. దోర్నాలలో డిగ్రీ, ఇంటర్ కళాశాలల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం విజయవాడ వరద బాధితులకు టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి రూ.50 వేలు , కందుల నారాయణరెడ్డి రూ.50 వేలు, పేరం రమణారెడ్డి రూ.50 వేలు, ఐటివరం టీడీపీ నాయకులు రూ.50 వేలు, సిద్దెనపాలెం టీడీపీ నాయకులు రూ.20 వేలు, చీదెళ్ల నాగేశ్వరరావు రూ.10 వేలు నగదును ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సాయికుమార్, తహసీల్దార్ హరిబాబు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, టీడీపీ ముఖ్య నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, వెంగల్‌రెడ్డి, కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, మంత్రునాయక్, వలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికే తొలి ప్రాధాన్యం

- రూ.15 కోట్లతో పంచాయతీ రోడ్లు
- కొమరోలు అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ
- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



గిద్దలూరులో క్రీడలు ప్రారంభిస్తూ మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

కొమరోలు, సెప్టెంబరు 21: తనకు రాజకీయాల కన్నా నియోజకవర్గ అభివృద్ధే తొలిప్రాధాన్యత అని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. కొమరోలు పంచాయతీ కార్యాలయంలో శనివారం 'మన మంచి ప్రభుత్వం' గ్రామసభను ఎంపీడీవో దేవండ్ల నరసయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ, తాను గత వైసీపీ ఎమ్మెల్యేలా మాటలు చెప్పేవాడిని కాదన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే వ్యక్తిగా ప్రజల మధ్యలో ఉంటానన్నారు. కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనలో పింఛన్ల పెంపు, లాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, నిరుద్యోగులకు డీఎస్సీ ప్రకటించడం, పేదలకు రూ.5లకే అన్నా క్యాంటీన్ల ద్వారా భోజనం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలుజేసిందన్నారు. రాష్ట్రానికి సమర్థుడైన వ్యక్తి సీఎంగా ఉన్నాడనానికి విజయవాడ వరదల సమయంలో చంద్రబాబు నాయుడు చేసిన కృషే నిదర్శనమన్నారు. పంచాయతీలకు జవసత్వాలు వచ్చేలా రూ.4500 కోట్లు నిదులను పంచాయతీలకు ఇచ్చిన ఘనత ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌దే అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సున్నావడ్డీతో డ్వాక్రా మహిళలకు రూ.5లక్షల నుంచి రుణ పరిమితి రూ.10లక్షలకు పెంచామని గుర్తు చేశారు. గిద్దలూరు నియోజక వర్గంలోని పంచాయతీ రోడ్ల అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు చేశారన్నారు. అందులో కొమరోలు గ్రామ పంచాయతీకి రూ. 80లక్షలు మంజూరయ్యాయన్నారు. మండల కేంద్రంలో గత టీడీపీ హయాంలో తాను చేపట్టిన మినీ స్టేడియం, బీసీ, కాపు, మైనార్టీల భవనాలను గత వైసీపీ హయాంలో నాటి పాలకులు అడ్డుకున్నారన్నారు. తాను కొమరోలు వాసినని, మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అంతకుముందు జడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరరాఘురెడ్డిని ఎమ్మెల్యే పరామర్శించారు. సర్పంచ్ దండు శశికళ మాట్లాడుతూ కొమరోలులో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీవో నరసయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, టీడీపీ ప్రధాన కార్యాదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి, జనసేన అధ్యక్షులు గజ్జలకొండ నారాయణ, ఎంఈవో వెంకటరత్నం, సొసైటీ మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు, గజ్జలకొండ వెంకటేశ్వర్లు, నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, చలిచీమల శ్రీనివాసచౌదరి, వీరంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, అనపా వీరశేఖర్, జ్యోతిరెడ్డి, గోడి ఓబుల్‌రెడ్డి, బి.బాలిరెడ్డి, లాయర్ విజయ్‌కుమార్‌రెడ్డి, అంబవరపు రామకృష్ణారెడ్డి, సుబ్రమణ్యం, రవింద్రారెడ్డి, ఎం.యల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గిద్దలూరు టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం గిద్దలూరు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ పాఠశాలల గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడలు ప్రారంభించారు. కబడ్డీ, షటిల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు లొక్కు రమేష్, టీడీపీ నాయకులు పందీటి రజనీబాబు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌బాబు



లాంగ్‌జంపు దూకుతున్న విద్యార్థి

తర్లుపాడు, సెప్టెంబరు 21: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలను శనివారం తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.సుధాకర్‌బాబు ప్రారంభించారు. ఈ పోటీల్లో 14, 15 సంవత్సరాల విద్యార్థులు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు చల్లా.నాయుడు తెలిపారు. లాంగ్ జంప్, ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ, సర్పంచ్ వరాలు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజారపు రామిరెడ్డి, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : మండలంలోని గజ్జలకొండ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎస్‌జీ యాఫ్, మండల స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు సహకరించిన దాతలకు, క్రీడలు నిర్వహించిన మండల సమన్వయకర్తకు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడలలో పాల్గొన్న ప్రతి విద్యార్థి గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా క్రీడా పోటీలలో పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ తోపాటు అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, మండల కోఆర్డినేటర్ బాబురావు తెలిపారు.

ప్రజాపాలనలో వందరోజుల్లోనే అభివృద్ధి

పొదిలి, సెప్టెంబరు 21 : ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ పాలన మొదలై 100 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. వందరోజుల పాలనకు పెద్దఎత్తున ప్రజామోదం లభించిందని టీడీపీ మండల అధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్‌లు అన్నారు. పట్టణంలో ఆరవ వార్డులో వందరోజుల్లో ఇది మంచి ప్రభుత్వం అని ప్రజల్లో మన్ననలు పొందిన బ్రోచర్లను పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. శనివారం పట్టణంలోని ఆరవ వార్డు, పోతవరంలో ఓబయ్య ఆధ్వర్యంలో, 238 బూత్ కన్వీనర్ మునిశ్రీను, జువ్వలేరు, మల్లవరంలో మాజీ మండలాధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఈగలపాడు, ఆముదాలపల్లి, బూత్‌కన్వీనర్, పట్టణ, మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ప్రారంభించడం లాంటి పలు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ముల్లా ఖుద్దూస్, జిల్లా ముస్లీం మైనారిటీ నాయకులు షేక్ రసూల్, నాయకులు ఎస్‌ఎం భాష, జ్యోతి మల్లిఖార్జున్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



కంభంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

సంక్షేమ ఫలాలు పేదలకు దక్కడమే ధ్యేయం

మార్కాపురం : సంక్షేమ ఫలాలు పేదలకు దక్కడమే ప్రభుత్వధ్యేయమని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 33వ వార్డులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. వందరోజుల్లోనే చాలావరకు పథకాలను ప్రజలకు అందించినట్లు తెలిపారు. టీడీపీ పోల్‌మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు షేక్ వహాలాలి, కౌన్సిలర్ నాలి.కొండయ్య, టీడీపీ నాయకులు హుసేన్‌ఖాన్, మర్రి కొండలు, చిలకపాటి లింగమయ్య పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు

మార్కాపురం రూరల్ : కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులలోనే పలు సంక్షేమ పథకాలు అమలుజేసి నట్లు పలువురు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులలోనే మెగా డీఎస్సీ భర్తీకి గ్రీన్ సిగ్నెల్ ఇచ్చారన్నారు. అధికారంలోని వచ్చిన మొదటి నెలలోనే ఏడు వేల రూపాయలు పెన్షన్ అందించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల ఒకటవ తేదీనే జీతాలు వేస్తున్నారన్నారు. విజయవాడలో వరద బాదితులకు అండగా ఉండి వారి పరిస్థితులను ప్రత్యక్షంగా పర్యవేక్షించి ప్రభుత్వ సాయాన్ని వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిచారని అన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే బోజనాన్ని అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, వీఆర్‌వో పోతులూరి రెడ్డి, పంచాయితీ కార్యదర్శి యన్ నారాయణరెడ్డి, డీలర్ గంగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి, అశోక్‌రెడ్డి, నాగార్జున, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మార్కాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

చంద్రన్నపాలనపై ప్రజలు సంతృప్తి

కంభం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, టీడీపీ జిల్లా మైనారిటీ సెల్ నాయకులు దాదా తెలిపారు. శనివారం కంభం పంచాయతీ పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సచివాలయం, సంగవీధిలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రతి నెలా 1వ తేదీన ఉద్యోగులకు జీతాలు, పంచాయతీల అభివృద్ధికి రూ.1,452 కోట్లు విడుదల చేశారన్నారు. ఫించన్లు 4వేలకు పెంచారని దివ్యాంగులకు రూ.6వేలు పెంచారన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ అనీస్, టీడీపీ నాయకులు తోట శ్రీనివాసులు, బిజ్జాల కిశోర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న హెచ్ఎం రామాంజనేయులు, విద్యార్థి సాయి

రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్‌లో దొనకొండ జడ్పీ పాఠశాలకు గుర్తింపు

దొనకొండ, సెప్టెంబరు 21: భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో పీఎంశ్రీ పాఠశాలల పరిధిలో డిజైన్ అండ్ ఎంటర్ ప్రైమనరేషన్ ఇన్నోవేషన్ క్యాంపును గన్నవరంలోని ఉషారమా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ప్రకాశం జిల్లా నుంచి దొనకొండ జడ్పీ పాఠశాలతో పాటు మరో నాలుగు పాఠశాలలు పాల్గొన్నాయి. ఇన్నోవేషన్ డిజైన్‌లో దొనకొండ జడ్పీ పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు పర్యవేక్షణలో పదోతరగతి విద్యార్థి సాయి తయారు చేసిన స్మార్ట్ ఐడీ కార్డు అనే ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ స్మార్ట్ ఐడీ కార్డుతో నాలుగు రకాలుగా ఉపయోగాలు ఉన్నాయని హెచ్ఎం రామాంజనేయులు వివరించారు. ఈసందర్భంగా కార్యక్రమ సీమేట్ డైరెక్టర్ మస్తానయ్య హెచ్ఎంను, విద్యార్థిని సన్మానించి జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడు మృతి

పీసీపల్లి, సెప్టెంబరు 21: మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయపాటి సుబ్బారావు(67) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన సతీమణి రమణమ్మ గతంలో ఎంపీపీగా పనిచేశారు. సుబ్బారావు మృతిచెందిన వార్త తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి మారెళ్లకు వచ్చి సుబ్బారావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వెంగళాయపల్లి సర్పంచ్ కరణం తిరుపతయ్య, కరణం తిరుపతిరావు, గల్లా చెన్నయ్య, కోటపాటి నరసింహారావు, గోగాడి రత్నయ్య, సర్పంచ్ పరిమి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



కర్ర లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ కోటయ్య

పీసీపల్లి, సెప్టెంబరు 21: వాహన చోదకులు మోటార్ వాహన చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ జి.కోటయ్య అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మండలంలో వాహనాలను తనిఖీ చేశారు. వెంగళాయపల్లి సమీపంలో కర్రను తరలిస్తున్న ట్రాక్టర్‌లను ఆపి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి సమయంలో కర్రలను తరలిస్తున్న ట్రాక్టర్‌లకు ముందు, వెనుక రేడియం స్టిక్కర్లను అమర్చాలని ఆదేశించారు. ప్రతి వాహనచోదకుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడంతో పాటు వాహనాలకు సంబంధించిన కాగితాలన్నింటిని దగ్గర ఉంచుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతి చెందిన మాలకొండయ్య

కనిగిరి, సెప్టెంబరు 21: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన శనివారం మండలంలోని గొల్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి మాలకొండయ్య (45) గొర్రెల షెడ్డు వద్ద పని ముగించుకుని ఇంటికి వెళ్లేక్రమంలో గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న బోరు మోటార్ వద్దకు వెళ్లి కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకునేందుకు బోరు మోటర్ స్విచ్ ఆన్ చేశాడు. నీళ్ళు రాకపోవటంతో మోటార్ వద్దకు వెళ్లి పరిశీలించగా సప్లయి వైరు తెగిపడి ఉంది. దీంతో వైరును జాయింట్ చేసేక్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు విరాళం

దర్శి, సెప్టెంబరు 21: దర్శి పట్టణానికి చెందిన రాష్ట్ర దివ్యాంగుల ఆర్గనైజింగ్ కార్యదర్శి సందు వెంకటరావు వరద బాధితుల సమాయార్థం రూ. 10 వేలు విరాళం శనివారం సీఎం చంద్రబాబుకు అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి చంద్రబాబుకు చెక్ అందజేశారు. దివ్యాంగులు తమవంతు సహకారంగా విరాళాలు అందిచటం పట్ల సీఎం చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారని వారు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పూసల ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దర్శి, సెప్టెంబరు 21: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం .మురళీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవలకాలంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు అధికమయ్యాయన్నారు. కొంతమంది వ్యక్తుల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొంతమంది రాజకీయాల పేరుతో మరికొన్ని సాకులతో గొడవలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అటువంటి వారిని ఉపేక్షించేదిలేదన్నారు. ఎంతటి గొప్ప వ్యక్తులైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

85 జీవోను రద్దు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21: పీజీ విద్యలో ఇన్ సర్వీసు కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోనెంబరు 85ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాహుల్, ఖాదర్‌మస్తాన్‌బీ డిమాండ్ చేశారు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నిరంతరం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. జీవో 85 కారణంగా వైద్యాధికారులు ఉన్నత విద్యను చదివేందుకు ఆటంకంగా ఏర్పడిందన్నారు. ఆ జీవోను రద్దు చేయాలని వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సదరు జీవోను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షోభంలోనూ సంక్షేమ ఫలాలు

- వెలిగండ్ల మండల అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

వెలిగండ్ల, సెప్టెంబరు 21: గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త పాలనతో రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ ఫలాలను అందించి కేవలం వంద రోజులలోనే మంచి పేరు తెచ్చుకుందన్నారు. కూటమి పాలన వందరోజులు పూర్తయిన సందర్భంగా శనివారం మండల పరిధిలోని వెదుళ్ళచెరువు పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ ప్రకటన, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు ప్రారంభించినట్టు చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత పారదర్శక పాలన అందించి ప్రజా మన్ననలు పొందుతామన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలోనే ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, శ్యామల కాశిరెడ్డి, కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, గోనా ప్రతాప్, గవదకట్ల హరికృష్ణ, చిలకల వెంకటేశ్వర రెడి, కొండు బాస్కర్‌రెడ్డి, గురుస్వామి, బొబ్బా రమణా రెడ్డి, బీరం బెంకటేశ్వర రెడ్డి, సర్పంచ్ పెరుగు తిరపతమ్మ, జయపాల్ రెడ్డి, కె.భాస్కర్ రెడ్డి, అంకయ్య, మీనిగ కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలి



పామూరులో ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికిస్తున్న కోటపాటి



కనిగిరి: తక్కెళ్ళపాడు గ్రామంలో వంద రోజుల పాలనపై వివరిస్తున్న శ్రీనివాసులురెడ్డి

పామూరు, సెప్టెంబరు 21: సంక్షోభంలోనూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధికి రెక్కలు తొడిగిందని టీ డీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు అన్నారు. మొదటి వందరోజుల్లోనే ప్రజల చేత ప్రశంసలు అందుకుంటుందని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజులలో సాధించిన విజయాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం ఇది మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణంలోని దేవా లయం వీధిలో నిర్వహించారు. ఇంటింకి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, పువ్వాడి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజా రహంతుల్లా, స య్యద్ అమీర్‌బాబు, ఆర్ఆర్ రఫి, ఇర్రి కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని బొట్లగూడూరు, కొండారెడ్డిపల్లి, నర్రమారెళ్ల, రావిగుంటపల్లి, పామూరులోని పలుచోట్ల వందరోజుల పాలనపై టీడీపీ శ్రేణులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కాగా, పామూరు సీఐ బీమానాయక్‌ను కోటపాటి జనార్దనరావు టీడీపీ శ్రేణులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



వెలిగండ్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

అభివృద్ధి దిశగా కనిగిరి

కనిగిరి, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వంలో కనిగిరి ప్రాంతం అభివృద్ధి దిశగా పయనిస్తుందని టీడీపీ మండల కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని తక్కెళ్ళపాడు పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వంద రోజుల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు.

పాలనా దక్షత కలిగిన సీఎం చంద్రబాబు సారథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మల్లెల పిచ్చయ్య, ప్రసాద్, ఏసురత్నం, నాగభూషణం, రావూరి రమణయ్య, విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, కనిగిరి నగరపంచాయతీ పరిధిలోని వివిధ వార్డుల్లో , మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దొనకొండ: ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ, సెప్టెంబరు 21: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మంగినపూడి గ్రామంలో శనివారం రాత్రి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అంటించే కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. దేశంలోని ఏరాష్ట్రంలో లేనివిధంగా రూ.4వేలు పింఛన్ అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. లక్షలాదిమంది ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లు ప్రారంభించినట్టు చెప్పారు. దీపావళికి మహిళలకు ఉచిత గ్యాస్ అందజేయనున్నట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఒకేరోజు 13326 గ్రామసభలు ఏర్పాటుచేసి పంచాయతీరాజ్ వ్యవస్థకు జీవం పోశారన్నారు. దర్శి నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం నిమిత్తం తమవంతు బాధ్యతగా మేగా జాబ్ మేళా నిర్వహించినట్టు చెప్పారు. అందులో 1700 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 587 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇది మా తొలి ప్రయత్నం మాత్రమేనని అన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, రాచగొర్ల వెంకటయ్య, పులిమి రమణాయాదవ్, కామేపల్లి చెంచయ్య, వల్లపునేని వెంకటస్వామి, దగ్గెంపూడి కోటేశ్వరరావు, శృంగారపు నాగసుబ్బారెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు, యరగొర్ల బసవయ్య, కొమ్మతోటి సుబ్బారావు, సింగమనేని హనుమంతు, విప్పర్ల శేషు, కుందుర్తి లక్ష్మణ్, షేక్ తోహిద్, వల్లపునేని ఆదినారాయణ, దుగ్గెంపూడి చెంచయ్య, మన్నెం గాలెయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, పోతిపోగు చెన్నయ్య, షేక్ సుభాని, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటరామయ్య, రోడ్డా రామయ్య, జనసేన నాయకుడు బండారు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వైసీపీ

దర్శి, సెప్టెంబరు 21: తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు అందించే లడ్డును వైసీపీ పాలకులు అపవిత్రం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ఎన్నో కుట్రలు చేసిందన్నారు. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవెంకటేశ్వరస్వామికి అపచారం చేస్తే తగిన ఫలితం అనుభవిస్తారని చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి ఎన్నో అపవిత్ర కార్యక్రమాలకు కారకులయ్యారని చెప్పారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వును వినియోగించినట్లు స్పష్టమైన ఆధారాలు లభించటంతో అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ కరెంట్ సరఫరాలో మార్పులు

కురిచేడు, సెప్టెంబరు 21: కురిచేడు సబ్‌స్టేషన్ పరిధిలోని వ్యవసాయ బోర్లకు సరఫరాలో మార్పులు చేసినట్టు ఏఈ సుబ్బారెడ్డి తెలిపారు. బోధనం పాడు, కటంవారిపల్లి, వీరాయపాలెం ఫీడర్ పరిధిలో అర్ధరాత్రి 2 నుంచి ఉదయం 11 గంటల వరకు, నమశ్శివాయపురం, ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, మిగిలిన రెండు గంటలు రాత్రి 9 నుంచి 11 గంటల వరకు సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమయం ప్రతి ఆదివారం రోజు మార్పు ఉంటుందని రైతులు గుర్తించాలన్నారు.

ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 21: ఆశా వర్కర్ల సమస్యలను తన పరిధిలోని అంశాలను వెంటనే పరిష్కరిస్తానని డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శనివారం ఆశా వర్కర్ల సమావేశం అనంతరం వారి సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

సమతుల్య ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సరోజిని

పామూరు, సెప్టెంబరు 21: గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సీడీపీవో సరోజిని అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పోషకాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిరోజు సమతుల్య ఆహారం అందాలంటే ప్రతిఒక్కరూ ఆకుకూరలు, ముడి ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు గ్రుడ్లు తీసుకోవాలని సూచించారు. శీతల పానీయాలు మాని మజ్జిగ, నిమ్మకాయ నీరు వంటివి తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటా రన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే రాగిజావ, చిక్కీలు, గ్రుడ్లను తీసుకోవాలన్నారు. అనంతరం పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.రామస్వామి, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

దొనకొండ, సెప్టెంబరు 21: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరంగా జన్మిస్తారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి అన్నారు. స్థానికంగా దొరికే మునగాకులో ఎక్కువ పోషక విలువలు ఉంటాయని తెలిపారు. మండలంలోని బాదాపురం-1, బాదాపురం-2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సుభాషిణి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సూపర్‌వైజర్ విన్యాసమ్మ, ఏఎన్ఎం ఇంది రాదేవి, కార్యకర్తలు డీఎల్ నరసమ్మ, బి.కుమారి, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

దర్శి, సెప్టెంబరు 21: దర్శిలో అన్న క్యాంటిన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు అంగీకరించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చంద్రబాబును ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా శుక్రవారం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో కలిసి అన్న క్యాంటీన్ భవన నిర్మాణం నిలిచిపోయిన విషయాన్ని వివరించారు. దర్శిలో పేద ప్రజలు ఎక్కువగా ఉన్నారని చెప్పగా ఇప్పటివరకు ఒక్క అన్న క్యాంటీన్ కూడా లేదా అని చంద్రబాబు ప్రశ్నించినట్లు సమాచారం. అందుకు గొట్టిపాటి లక్ష్మి సమాదానమిస్తూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన భవనం మధ్యలో నిలచిపోయిందని చెప్పారు. అందుకు స్పందించిన సీఎం చంద్రబాబు భవన నిర్మాణం పనులు పునఃప్రారంభానికి చర్యలు తీసకుంటామని హమీ ఇచ్చారు. దర్శిలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టమైన హమీ ఇవ్వటంతో గ్రీన్‌సిగ్నల్ లభించినట్లయింది. దర్శి-కురిచేడు రోడ్డులో మధ్యలో ఆగిపోయిన ఈ భవన నిర్మాణం 70 శాతం పూర్తయింది. మిగిలిన పనులు పూర్తిచేసి రెండు నెలల్లో అన్న క్యాంటీన్ ప్రారంభించేం దుకు కృషి చేస్తామని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన అన్న క్యాంటీన్ భవనం

తీరాన్ని కాపాడుకుందాం

- మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి

కొత్తపట్నం(ఒంగోలునగరం) సెప్టెంబరు 21: సముద్ర తీర ప్రాంతం కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఆవుల చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొత్తపట్నం పల్లెపాలెం సముద్ర తీరంలో స్వచ్ఛసాగర్- సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహించారు. మత్స్యకార సంక్షేమ సమితి, హైదరాబాద్‌కు చెందిన ఇన్ కాయిస్ సంస్థలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని తీరంలో తీరంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

ఈసందర్భంగా జరిగిన సమావేశంలో జేడీ చంద్రశేఖరరెడ్డి, జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి బెన్‌హర్, ఒంగోలు శ్రీరామ్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించిన అనంతరం పారేయడం వల్ల సముద్ర తీరం కలుషితం అవుతుందని చెప్పారు. సముద్రసంపదను ప్లాస్టిక్ వ్యర్థాలు దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సముద్ర జలాలు కూడా కలుషితం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త వేదుల చంద్రశేఖర్, మత్స్యకారసంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి సున్నపు తిరుపతిరావు, సర్పంచ్ ఆనందరావు, ఎంపీటీసీ నరసింహారావు, సమితి బీచ్ ఇన్‌చార్జి రేవు చలపతివర్మ తదితరులు పాల్గొన్నారు.

తీరంలో విద్యార్థుల 'స్వచ్ఛసాగర్'

అంతర్జాతీయ తీర ప్రాంత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కొత్తపట్నం జడ్పీ హైస్కూలు విద్యార్థులు స్వచ్ఛసాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు 208 మంది విద్యార్థులు సముద్ర తీర ప్రాంతంలో ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఇటీవల వినాయక నిమజ్జనాలతో తీరం చెత్తా చెదారంతో నిండిపోయింది. దీంతో విద్యార్థులు వ్యర్థాలను తొలగించి తీరాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ తన్నీరు బాలాజీ, ట్రైనింగ్ కమిషనర్ కేవీ.శేషారావు, జిల్లా కోశాధికారి పర్రె వెంకటరావు, ఫ్లాక్ లీడర్ కె.పద్మశ్రీ, స్కౌట్ మాస్టర్ చక్కా కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు బాలాజీ, సురేంద్రబాబు, నరసింహారావు, వెంకటకృష్ణయ్య, శేషగిరి, చంద్రశేఖర్, శ్రీవాణి విద్యానికేతన్, ఒంగోలు ఏకేవీకే కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.







జగనన్న.. భూ భక్ష

పథకం రద్దుతోనే రక్షణంటున్న రైతులు

భూ సమస్యలు.. భూ వివాదాల పరిష్కారం కోసమంటూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం సరికొత్త సమస్యలు తీసుకొచ్చింది. భూ రక్ష మాటేమో కానీ పలువురి భూములను మాయం చేసి భూ భక్ష పథకంగా మారింది. సర్వే అనంతరం గతంలో కంటే అత్యధికంగా భూ సమస్యలు, వివాదాలు నెలకొన్నాయంటే ఈ పథకం ఎంత లోపభూయిష్టంగా జరిగిందో తెలుస్తోంది. ఈ పథకం లోపాల పుట్టగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్' గా పేరు మార్చింది. అయితే సర్వే అనంతరం నెలకొన్న సమస్యల గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని.. అసలు పథకాన్ని, సర్వేను రద్దు చేయాలని భూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు. వంశపారంపర్యంగా వచ్చిన రైతుల భూ హక్కులను హరించిన అప్పటి సర్వేనే రద్దు చేయాలని రైతులు, రైతు సంఘాల డిమాండ్ చేస్తున్నాయి.



ఎందరో మనోవేదన

పాత కాలం వదిలేస్తే, బ్రిటీష్ కాలంలో 1906 నుంచి 1927 వరకు రీ సర్వే జరిపారు. దీనిలో జరిగిన లోటుపాట్లను సవరించడానికి మరో పదేళ్లు దీనిని పొడిగించారు. ఆ తర్వాత కూడా సర్వేలు జరుగుతూనే వచ్చాయి. అయితే ఇంతటి తక్కువ కాలంలో చేయగలిగే అవకాశం ఇప్పుడున్నా, సాంకేతికతను పక్కనపెట్టి, కాగిత ఆధారాలు పట్టించుకోకుండా రెండేళ్లలో చేసిన సర్వే రైతుల హక్కును భక్షించేసింది. విదేశాల్లో ఉన్నవారికైతే నేటికీ వారి భూముల పరిస్థితి ఏమిటనేది తెలియని పరిస్థితి. ఒకవేళ రికార్డులు తారుమారయ్యాయని తెలిసినా, అక్కడి నుంచి వచ్చి తిరగలేని పరిస్థితుల్లో మనోవేదనకు గురవుతున్న వారూ ఉన్నారు.

వైసీపీ నేతల మాటలతోనే..

భూముల రీ సర్వేలో దస్తావేజులు, పాస్ పుస్తకాలతో పని లేదు. వెబ్‌లాండ్ రిజిష్టర్, అడంగల్, ఈసీ వంటివి కూడా అవసరంలేదు. వీటన్నింటికీ మించి గత ప్రభుత్వంలోని వైసీపీ నేతల నోటి మాటకే అధికారులు సర్వేలో ఎక్కువ విలువిచ్చారు. వారు తమ వారికి ఎంత పొలం ఉందంటే అంత రాసేశారు. డ్రోన్ కెమేరా చిత్రాలు, ఓఆర్ఐ మ్యాప్‌కు మ్యాచ్ కాక రిమార్క్ చూపినా వాటిని రిజెక్ట్ కొట్టేసి మరీ వారు అనుకున్న ప్రకారం సర్వే చేశామనిపించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 80 శాతం గ్రామాల్లో ఇదే తీరులో సర్వే జరిగిందనడానికి ప్రస్తుతం భూ వివాదాలకు సంబంధించి కోర్టులో ఈ రెండేళ్లలో పెరుగుతూ వచ్చిన కేసుల సంఖ్యే సాక్ష్యం.



గుంటూరులో ఓ వ్యక్తికి దస్తావేజులు, పాస్ పుస్తకాల ప్రకారం 1.30 ఎకరాల భూమి ఉంది. కానీ రీ సర్వే చేసి ఆయన పేరుపై 1.42 ఎకరాలు నమోదు చేశారు. మిగిలిన 12 సెంట్లు పక్కరైతు భూమి. ఇప్పుడు ఆ రైతు తనకు తెలియకుండా తన భూమిని మరొకరికి ఎలా రాసేస్తారంటూ అధికారులపై కేసు వేశారు.

తెనాలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీ సర్వే చేపడతామని, దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరిస్తామని.. దేశంలోనే ఇదొక గొప్ప పథకం అంటూ 2022 నవంబరులో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా అధికారులు రీ సర్వే చేపట్టారు. అయితే రీ సర్వేతో భూ సమస్యలు తీరిపోతాయని, సరిహద్దుల గొడవలన్నీ పరిష్కారం అవుతాయని అప్పట్లో అందరూ భావించారు. అయితే వారి ఆలోచనలను తలకిందులు చేస్తూ ఉన్న సమస్యల పరిష్కారం కాదుకదా.. వాటి స్థానంలో కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. అమ్మినవారికి, కొన్నవారికి, జాయింట్ ఖాతాలున్న వారికి మధ్య, కుటుంబాల్లోని అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మధ్య కూడా ఈ సర్వేతో చిచ్చురేగింది. ఒకరిపై ఒకరు కోర్టులో కేసులు వేసుకునే వరకు రీ సర్వే చిచ్చు రేపింది. ఇన్ని సమస్యలు కేవలం రీ సర్వే సృష్టించినవే అయితే, వాటిని క్షేత్ర స్థాయిలో అప్పటికప్పుడు పరిష్కరించాలంటూ అప్పటి ప్రభుత్వం స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్‌లను నియమించింది. వారేం చేస్తున్నారనేది కూడా అంతుబట్టని విషయమే.

అర్హత లేకున్నా రీ సర్వే కోసంగా ఉద్యోగోన్నతులు..


రీ సర్వేలో సమస్యలను రికార్డుల ఆధారంగా పరిశీలించి అప్పటికప్పుడు పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం కొందరు డిప్యూటీ తహసీల్దార్‌లను స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్లుగా నియమించింది. అయితే డీటీగా ఉన్నవారిని ఈ పోస్టులకు పంపితే పర్వాలేదు. కానీ సీనియర్ అసిస్టెంట్లకు ఏ అర్హతా లేకుండానే వారికి ఉద్యోగోన్నతులు ఇచ్చేసి నియమించింది. సాధారణంగా సీనియర్ అసిస్టెంట్ డిప్యూటీ తహసీల్దార్ కావాలంటే డిపార్ట్‌మెంట్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలి. కానీ అవేమీ లేకుండానే వారికి డీటీలుగా ఉద్యోగోన్నతి ఇచ్చేశారు. స్పెషల్ మొబైల్ మేజిస్ట్రేట్ హోదాలో రీ సర్వే కారణంగా వచ్చిన వివాదాలను పరిష్కరించిన దాఖలాలు ఏవైనా ఉన్నాయంటే వేళ్లపై లెక్కపెట్టడానికి కూడా దొరకవు. తహసీల్దార్‌లు, సబ్‌కలెక్టర్, కలెక్టర్ కార్యాలయాలనే బాధితులు ఆశ్రయించారు. చాలావరకు కోర్టులకు వెళ్లినవారూ ఉన్నారు.

- పథకం పేరు మార్చితే సరిపోదంటున్న బాధితులు
- రీ సర్వేతో ఉన్న సమస్యలు తోడైన సరికొత్త సమస్యలు
- రికార్డులను పరిశీలించకుండానే ఇష్టానుసారంగా సర్వే
- ఊరిలో లేకుంటే వారి భూములు మరొకరికి ధారాదత్తం
- సర్వే జరిగిన గ్రామాల్లో 90 శాతం కొత్త భూ సమస్యలే
- కార్యాలయాలు, కోర్టుల చుట్టూత బాధితుల ప్రదక్షిణలు

ప్రభుత్వం వివాదాల పరిష్కారం కోసమని ప్రత్యేక ప్రమోషన్‌లు ఇస్తే, వాటిని వారు పరిష్కరించకపోవడంతో కోర్టుల్లో కేసులు పెరిగి సమయం, కేసుల భారం ఎక్కువైపోయింది. అయితే ఈ ప్రత్యేక ఉత్తర్వులను అడ్డుపెట్టుకుని డీటీలుగానే అర్హత లేనివారు ఇప్పుడు ఏకంగా తహసీల్దార్ హోదాలో చలాయించేస్తున్నారు.

గత సర్వే రద్దు చేయాల్సిందేనా..

గత వైసీపీ ప్రభుత్వ కాలంలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రీ సర్వేను రద్దు చేయాలనేది రైతులు, రైతు సంఘాల వాదన. సర్వే విషయంలో కనీస జాగ్రత్తలు, రికార్డుల పరిశీలన జరగలేదని, కేవలం అప్పటి నేతల సిఫార్సులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే జరిగిపోయిందనేది వారి వాదన. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష పథకం లోపాల పుట్టగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తాజాగా పేరును మార్చింది. ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్ట్‌గా పేరు మార్చుతూ ఈ నెల 17న ముఖ్య కార్యదర్శి పేరుతో జీవో విడుదల చేశారు. అయితే కేవలం పేరు మార్చితే సరిపోదని గత రీ సర్వేను రద్దు చేసి, తిరిగి వాస్తవ పరిస్థితుల ఆధారంగా జరపాలనేది రైతుల విన్నపం.



రీ సర్వే సమస్యల్లో కొన్ని ఉదాహరణలు..

* తెనాలి మండలం పినపాడులో ఓ వ్యక్తికి 4.3 ఎకరాల పొలం వంశపారంపర్యంగా వచ్చింది. రీ సర్వే నాటికి ఆయన చనిపోవడం, ఆయన నలుగురు సంతానంలో ఒక్కరు మాత్రమే స్వగ్రామంలో ఉన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ముగ్గురి పేరుపై ఒక్క సెంటు కూడాలేకుండా, మొత్తం విస్తీర్ణాన్ని స్థానికంగా ఉన్న వ్యక్తికే రాసేశారు. దీంతో మిగిలిన ముగ్గురు సోదరులు తమ భూ హక్కు కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. భూమి మొత్తం సొంతం చేసుకున్న వారి సోదరుడు తన బంధువుతో ఆ భూమికి సంబంధించి వివాదం ఉన్నట్లు కోర్టులో కేసు వేశారు. దీంతో రెవెన్యూ అధికారులు కూడా కోర్టులో కేసు ఉందనే కారణంతో దానిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేశారు.
* రేపల్లెలో ఓ వ్యక్తి తనకున్న 1.80 ఎకరాల పొలంలో ఒక ఎకరం అమ్మేసి, తన పేరుపై మిగిలిన 80 సెంట్లు అట్టిపెట్టుకున్నారు. అయితే రీ సర్వేలో అమ్మిన భూమిని కూడా అతడికే సొంతమని నమోదు చేశారు. కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ పత్రాలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, అమ్మిన వ్యక్తి మాత్రం తాను తన పొలం ఎవరికీ అమ్మలేదని, అసలు రిజిస్ట్రేషనే చేయలేదని, తన భూమిని అన్యాక్రాంతం చేసేందుకు అధికారులతో కలసి కుట్రలు చేస్తున్నారంటూ అతడిపై కోర్టులో ఎదురు దావా వేయడం విశేషం.
* తెనాలి మండలం కఠెవరంలో 308 సర్వే నంబరు నుంచి భూమిని ఓ వ్యక్తి నుంచి ప్రభుత్వం దశాబ్దాల క్రితం కొనుగోలుచేసి పేదలకు పట్టాలిచ్చింది. అదే నంబరులో మరో 1.5 ఎకరాల భూమిని వారు ప్రభుత్వానికి అమ్మలేదు. 20 ఏళ్లుగా వారికిందే ఉన్న ఆ భూమికి సంబంధించి దస్తావేజులు, పాస్ పుస్తకాలు, అడంగల్ అన్నీ వారే ఆ భూమికి హక్కుదారులని చూపిస్తున్నది. అయితే వాటిని పట్టించుకోకుండా రీ సర్వే సిబ్బంది ఆ భూమిని కూడా ప్రభుత్వ భూమి కింద నమోదు చేశారు. ఇప్పుడు ఆ భూమిపై తనకు హక్కుందని తప్పును సరిదిద్ది, తన భూమిని తనకు అప్పగించాలని ఓ మహిళ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఆశ్రయించారు.
* తెనాలిలో 2.5 ఎకరాల భూమికి హక్కుదారు అంటూ రీ సర్వేలో ఆసిఫ్‌ఉన్నీసా అనే మహిళ పేరుపై నమోదు చేశారు. ఇక్కడ విశేషమేమంటే అసలు ఆ పేరున్న మహిళే అక్కడ లేరు. ఏ రికార్డులూ పరిశీలించకుండా, ఏ ఆధారాలు లేకుండా కొత్త పేరు ఎలా నమోదు చేశారనేది సర్వే సిబ్బంది నిర్లక్ష్యాన్ని, రీ సర్వే జరిపిన తీరును వేలెత్తి చూపిస్తుంది. ఆ భూమి అసలు హక్కుదారు తన భూమిని తన పేరుపై మార్చాలని ఆధారాలతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ లబోదిబోమంటున్నారు. ఇప్పుడు అసలు రైతు పేరుపై మార్చి రాయాలంటే, మొదట నమోదు చేసిన రైతుకు నోటీసులిచ్చి, ఆ భూమిపై తనకున్న హక్కును నిరూపించుకోలేని పక్షంలోనే పేరు మార్పు చెయ్యాలి. కానీ అసలు లేని రైతును ఎక్కడి నుంచి తీసుకురావాలో అధికారులకు అంతుపట్టని సమస్య.



వైసీపీలో.. దయనీయం

- వంద రోజుల్లో సీన్ రివర్స్
- జిల్లా పగ్గాలు అందుకునేవారే కరువు
- ఇప్పటికే వైసీపీని వీడిన మోపిదేవి, పోతుల
- తనను నియోజకవర్గానికే పరిమితం చేయాలన్న కరణం

బాపట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉన్నన్నాళ్లు అత్యంత బలంగా ఉన్న వైసీపీ.. అది కోల్పోగానే గడ్డు పరిస్థితి ఎదుర్కొంటోంది. ఒకప్పుడు పార్టీ పదవుల కోసం పోటీ పడిన నేతలే నేడు ముఖం చాటేసే పరిస్థితి నెలకొంది. జిల్లా పగ్గాలు చేపట్టడానికి ఎవరూ ముందుకు రాని అత్యంత దయనీయ పరిస్థితిలో ఆ పార్టీ ఉంది. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సాధించిన పురోగతిని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతుండగా.. ఇదే సమయంలో వైసీపీ పరిస్థితి పూర్తిగా రివర్స్ అయింది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులలో ఏ ఒక్కరూ అటు ప్రజలకు, ఇటు పార్టీ శ్రేణులకు అందుబాటులో లేకపోవడంతో దశదిశలేని విధంగా ఆ పార్టీ పరిస్థితి తయారైంది. అధికారం కోల్పోయిన వంద రోజుల వ్యవధిలోనే పార్టీ పరిస్థితి ఇంతలా దిగజారడంపై రాజకీయ పండితులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా పోటీ చేసిన అభ్యర్థులతో అధినేత జగన్ తాడేపల్లిలో శుక్రవారం సమావేశమయ్యారు. దీనికి కరణం వెంకటేశ్, హనిమిరెడ్డి, వరికూటి అశోక్‌బాబు, మేరుగ నాగార్జున, ఈవూరు గణేష్‌లు హాజరయ్యారు. విదేశాల్లో ఉన్న బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, పర్చూరు నుంచి పోటీ చేసిన యడం బాలాజీలు హాజరుకాలేదు. మోపిదేవి వెంకటరమణ రాజీనామాతో ఖాళీగా ఉన్న జిల్లా బాధ్యతలతో పాటు పార్టీ పరిస్థితిపై జగన్ వారితో చర్చించారు. చీరాల నుంచి పోటీ చేసి ఓడిన కరణం వెంకటేశ్‌ను జిల్లా పగ్గాలు అందుకోవాలని జగన్ కోరారు. మిగిలిన నాయకులు కూడా జగన్ నిర్ణయానికి ఆమోదం తెలిపారు. అయితే వెంకటేశ్ తనకు కొంత సమయం ఇవ్వాలని, తండ్రి బలరాంతో మాట్లాడి చెబుతానని తొలుత చెప్పారు. ప్రస్తుతం మాత్రం తనను నియోజకవర్గానికే పరిమితం చేయాలని వెంకటేశ్ కోరుతున్నట్లు తెలిసింది. ప్రస్తుత గడ్డు పరిస్థితుల్లో పార్టీ పగ్గాలు అంటే అది గుదిబండే కానుందనే అభిప్రాయానికి వెంకటేశ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో పార్టీ పగ్గాలు అందుకునే వారే జిల్లాలో కరువయ్యారనే చర్చ ప్రజల్లో సాగుతుంది.

ఇప్పటికే పార్టీని వీడిన మోపిదేవి, పోతుల

జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ ఇటీవల పార్టీకి గుడ్‌బై చెప్పడంతో పాటు ఎంపీ పదవికి కూడా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రేపోమాపో ఆయన టీడీపీలో చేరడం లాంఛనమే. ఇదే సమయంలో చీరాలకు చెందిన పోతుల సునీత కూడా పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా సమర్పించడంతో వైసీపీకి దెబ్బమీద దెబ్బ పడింది. తాజాగా ఉమ్మడి ప్రకాశం జిల్లాకి చెందిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీని వీడి జనసేన తీర్థం పుచ్చుకోవడానికి సర్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. బాలినేని నిర్ణయం పర్చూరు, చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో వైసీపీలో ఉన్న ద్వితీయశ్రేణి నేతలపై ప్రభావం చూపనుంది. ఎన్నికలకు ముందే అద్దంకి సీటు హనిమిరెడ్డికి కేటాయించడాన్ని బాలినేని తీవ్రంగా విభేదించిన సంగతి తెలిసిందే. చీరాల పరిణామాలపై కూడా అప్పట్లో అధిష్ఠానం దృష్టికి ఎన్నికల ముందు తీసుకెళ్లి అసంతృప్తి వెలిబుచ్చారు. ఈ క్రమంలో చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల పరిధిలో బాలినేని అనుచరగణం ఎవరి దారి వారు చూసుకునే అవకాశాలు మెండుగా కనబడుతున్నాయి.

పత్తాలేని వైసీపీ నేతలు...

ఇటీవల వరదలకి జిల్లా అతలాకుతలామైంది. అయితే ఎక్కడా ఒక్క వైసీపీ నాయకుడు కూడా బాధిత ప్రజలను పరామర్శించడానికి వచ్చిన దాఖలాలు కనబడలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వైసీపీ అభ్యర్థులెవరూ కూడా ఇప్పుడు స్థానికంగా అందుబాటులో లేరు. ఎన్నికలకు ముందు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి రాజకీయ ప్రయోజనం పొందాలని చూసిన నేతలు ఫలితాల తర్వాత పత్తా లేకుండా పోవడాన్ని ఆ పార్టీ కార్యకర్తలకే మింగుడుపడకుండా ఉంది. బాపట్ల ఎంపీగా పోటీ చేసిన నందిగం సురేష్‌ను కేసులు వెంటాడుతున్నాయి. ఇక ద్వితీయశ్రేణి నేతాగణం చాలా వరకు పార్టీకి దూరం జరగ్గా మరి కొంతమంది నేతల కదలికలకు అనుగుణంగా అడుగులు వేయడానికి వేచిచూస్తున్నారు.

టెండర్ సరే.. రోడ్డు ఎప్పటికో?

- తీరంలో డబుల్ రోడ్డుకు రూ.8 కోట్లు
- పనుల్లో జాప్యంపై పర్యాటకుల అసంతృప్తి



పొట్టిసుబ్బయ్యపాలెం వై జంక్షన్ వ్యూ

చీరాల, సెప్టెంబరు 21: చీరాల మండలం వాడరేవు నుంచి వేటపాలెం మండలం రామాపురం మీదగా పొట్టి సుబ్బయ్యపాలెం వరకు రూ.8 కోట్లతో డబుల్ రోడ్డు వేసేం దుకు నిధులు మంజూరయ్యాయి. దీనికి టెండర్ పూర్తయింది. మార్చి 16న అగ్రిమెంట్ జరిగింది. కానీ ఇంత వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించ లేదు. రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంపై పర్యాటకులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టరు అక్కడక్కడా కొంతమేర జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. అంతకు మించిన పనులు అడుగు ముందుకు పడలేదు. పొట్టి సుబ్బయ్యపాలెం నుంచి 216 జాతీయ రహదారి వరకు డబుల్ రోడ్డు ఉంది. వాడరేవు నుంచి రామాపురం మీదగా పొట్టిసుబ్బయ్యపాలేనికి ప్రతిపాదిత రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తే వాడరేవు నుంచి 216 జాతీయ రహదారి వరకు మొత్తం డబుల్ రోడ్డు అవుతుంది. ఈ నేప థ్యంలో పనులు వెంటనే ప్రారంభించే విధంగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చారిత్రాత్మకం



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు,కలెక్టర్ వెంకటమురళి

యనమదలలో ఇది మంచి ప్రభుత్వం సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

యద్దనపూడి(మార్టూరు), సెప్టెంబరు 21 : రైతులను భయభ్రాంతులకు గురిచేసిన, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసంతకం చారిత్రాత్మక నిర్ణయమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం యద్దనపూడి మండలం యనమదలలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మంత్రి ప్రసంగించారు. తాము వంద రోజుల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజల కోసం చేశామన్నారు. పర్చూరు నియోజకవర్గంలో ఉద్యోగాలు కల్పన, సిమెంట్ రోడ్ల ఏర్పాటు, పొలాలకు డొంక రోడ్ల అభివృద్ధి చేయాలన్న ఆలోచనకు ఏలూరి సాటి అన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ దొంగ ఓట్లు నమోదుపై పోరాడిన తనపై వైసీపీ కక్షతో కేసులు నమోదు చేసినా ప్రజల ఆశీస్సులతో పోరాటం చేసి గెలిచినట్లు తెలిపారు. బీసీ కాలనీలో రూ.65 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు కలెక్టర్ వెంకటమురళితో కలిసి మంత్రి, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో కృష్ణకుమారి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, నాయకులు సింగ్ చంద్రశేఖర్, భద్రయ్య, రమేష్, అప్పారావు, మక్కెన రాంబాబు, గొట్టిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

అద్దంకి, సెప్టెంబరు 20: విజయవాడ వరద బాధితుల సహాయం చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని నాగులపాడుకు చెందిన మంగమూరి శేషగిరిరావు, ఎం.దీపిక రూ.20వేల చెక్కును శనివారం మంత్రి రవికుమార్‌కు అందజేశారు. పంగులూరు మండలం చందలూరుకు చెందిన పెంట్యాల రాంబాబు అన్న క్యాంటీన్‌కు రూ.5వేల విరాళాన్ని మంత్రికి అందజేశారు.

చీరాల: వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు మండల పరిధిలోని విజయనగర కాలనీవాసులు రూ.లక్షా17వేల చెక్కును శనివారం ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇంకొల్లు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఇంకొల్లులోని నివేదిత ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం రూ.లక్ష చెక్కును ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏలూరిని కలిసి అందజేసారు. స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ గోరంట్ల సుబ్బారావు ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బంది విరాళాలను సేకరించగా, యాజమాన్య సహకారంతో రూ.లక్ష సేకరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్, అకడమిక్ డైరెక్టర్ సుబ్బరామిరెడ్డి, కరి చిరంజీవి, విద్యార్థులు చెక్కును అందజేశారు.

పంగులూరు: వరద బాధితులకు లక్షా పదివేల ఆర్థిక సాయాన్ని అందించారు. గ్రామానికి చెందిన తాళ్లూరి రామాంజనేయులు, బాచిన శ్రీనివాసరావు తమ మిత్రులతో ప్రజల నుంచి విరాళాలను సేకరించారు. డీడీ తీసి మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో చిలుకూరి మాధవి, వడ్డెంపూడి హనుమంతరావు, పఠాన్ అబ్దుల్ రఫీ, సుబ్బారావు పాల్గొన్నారు.

సీబీఐ విచారణ జరపాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21 : తిరుమల పవిత్రతను నాశనం చేసిన గత వైసీపీ ప్రభుత్వంపై సీబీఐ విచారణ జరపాలని ఏపీ బ్రాహ్మణ కరణాలు -నియోగి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నలూరి కిరణ్‌కుమార్ శర్మ డిమాండ్ శనివారం ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. తిరుపతి లడ్డూలో వేపనూనె, జంతు కళేబరం నూనెలతో అపవిత్రమైన పనులు చేసి స్వామివారి కైంకర్యాలకు ఉపయోగించడం, ప్రసాదాన్ని కోట్లాది మంది స్వీకరించడం జరిగిందన్నారు. హిందూ ధర్మాన్ని నాశనం చేసిన అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని, భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డిను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీపీగా వీరనారాయణ



మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న న్యాయవాదులు

అద్దంకి, సెప్టెంబరు 21 : అద్దంకి కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా న్యాయవాది వడ్లవల్లి వీరనారాయణను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. వీరనారాయణను ఏపీపీగా నియమించిన నేపథ్యంలో శనివారం వీరనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావి హజరత్తయ్య, మోతుకూరి సుభాష్‌బాబు, ఎం.చంద్రశేఖర్, గృహలక్ష్మి తదితరులు మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

రిజిస్ట్రేషన్ లేకుండా స్కాన్ సెంటర్లు నిర్వహిస్తే చర్యలు



స్కాన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

చీరాల, సెప్టెంబరు 21: జిల్లాలో ఎవరైనా రిజిస్ట్రేషన్ లేకుండా స్కాన్ సెంటర్స్ నిర్వహించరాదని, అలా నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ చెప్పారు. చీరాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో శనివారం ఆమె ఆ ఆసుపత్రిని తనిఖీ చేశారు. అలాగే రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రేమ హార్ట్ సెంటర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి స్కాన్ సెంటర్ పీసీపీ, ఎన్‌డీటీ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి రెన్యువల్ చేయించుకోవాలని చెప్పారు. డీఎం అండ్ హెచ్‌వోతో పాటు డాక్టర్ బ్రహ్మం, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో మరియమ్మ ఈ తనిఖీలలో పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

చీరాలటౌన్, సెప్టెంబరు 21 : గతకొంత కాలంగా చీరాల మండల పరిధిలోని బుర్లవారిపాలెం, తోటవారిపాలెం పరిధిలో జోరుగా జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై కలెక్టర్ వెంకటమురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈక్రమంలో గత ఐదు రోజుల కిందట రెవెన్యూ అధికారులతో పాటు ఆయా సచివాలయాల సిబ్బందికి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. దీంతో వీరంతా శనివారం నేరుగా కలెక్టర్ వద్ద హాజరై లిఖిత పూర్వక వివరణ ఇచ్చారు. తవ్వకాల విషయంలో ఎటువంటి సందేహాలు లేకుండా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలు జరిగినందున గమనించలేదని అందులో వివరించారు. ఇకపై పారదర్శకంగా ఉంటామని కలెక్టర్‌కు తెలిపారు. తోటవారిపాలెంలో సచివాలయం 2 పరిధిలో తవ్వకాలు జరగగా, సచివాయలం 1 సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందినట్లు తెలుస్తోంది.

28 నుంచి 'మన ఇల్లు-మన గౌరవం'

- గృహ నిర్మాణాలపై ప్రత్యేక కార్యక్రమం
- అధికారులకు కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 21 : జిల్లాలో గృహాలన్నింటినీ పూర్తి చేసేందుకు మన ఇల్లు-మన గౌరవం పేరుతో ఈనెల 28నుంచి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం మండల స్థాయి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వివిధ పథకాల కింద మంజూరు చేసిన గృహాలు, వాటి పురోగతిని సమీక్షించి దిశానిర్దేశం చేశారు. పీఎంఏవో 1.0 కింద మంజూరైన గృహాల్లో అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు హౌసింగ్ లే అవుట్లలో పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడాలని సూచించారు. వంద రోజుల్లో జిల్లాలో 3,044 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు చెప్పారు. వాటిలో ఇప్పటి వరకూ 345 నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. మిగిలిన 2,699 ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణం పూర్తి కోసం ఉపాధి పథకం కింద 90 రోజులు పని దినాలను కేటాయించడం జరిగిందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ, ఆయాశాఖల అధికారులు శ్రీనివాస ప్రసాద్, ఉషారాణి, మాధురి, వసుంధర, రవికుమార్, జగన్నాథరావు, శ్రీనివాసరావు, అంజల తదితరులు పాల్గొన్నారు.

100 రోజులు.. 3,044 గృహాలు

- లెంటల్, శ్లాబు దశకు వచ్చిన వాటి నిర్మాణాల పూర్తికి ప్రణాళిక
- లబ్ధిదారులకు వారంవారం బిల్లుల చెల్లింపు
- జిల్లాలో 26 వేల గృహాలు రద్దు
- గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు
- యూనిట్ విలువ తక్కువ ఉండటంతో నిర్మాణాలు ప్రారంభించని వైనం
- మళ్లీ వారికి యూనిట్ విలువ పెంచి మంజూరు చేయనున్న కూటమి ప్రభుత్వం

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. అందుకోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరై వైసీపీ పాలకుల నిర్వాకంతో జిల్లాలో వివిధ దశల్లో నిలిచిపోయిన 16,066 ఇళ్లను దశల వారీగా నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా తొలి దశ కింద 100 రోజుల్లో 3,044 గృహ ప్రవేశాలను లక్ష్యంగా నిర్దేశించింది. అందుకు సంబంధించి గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. లబ్ధిదారులతో మాట్లాడటంతోపాటు అవసరమైన నిర్మాణ సామగ్రిని అందుబాటులోకి తెస్తున్నారు. మరోవైపు గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన వాటిలో 26 వేల గృహాల నిర్మాణాలను లబ్ధిదారులు ఇప్పటి వరకూ ప్రారంభించ లేదు. యూనిట్ వ్యయం అతి తక్కువగా ఉం డటం, అది బేస్‌మట్టంకు కూడా సరిపోకపోవడంతో వారు వెనకడుగు వేశారు. ప్రస్తుతం ఈ గృహాలను కూట మి ప్రభుత్వం రద్దు చేయనున్నట్లు తెలుస్తోంది. యూనిట్ వ్యయం పెంచి కొత్తగా మంజూరు చేయనున్నట్లు సమాచారం.

ఒంగోలు నగరం, సెప్టెంబరు 21: పక్కా గృహాల నిర్మాణాలను గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఆర్భాటంగా గృహాలను మంజూరు చేసినప్పటికీ యూనిట్ విలువ తక్కువగా ఉండటంతో అనేక మంది లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఇలాంటి వారు 26వేల మంది వరకూ ఉన్నారు. అదేసమయంలో అంతకుముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో గృహాలు మంజూరై నిర్మాణాలు చేపట్టిన వారికి అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బిల్లులు నిలిపివేసింది. దీంతో జిల్లాలో వేలాది మంది తమ ఇంటి నిర్మాణాలను అర్థంతరంగా ఆపేసుకున్నారు. ఇలా 16,066 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. వీటికి పాత బిల్లులు చెల్లించి వెంటనే నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అదేసమయంలో యూనిట్ విలువ పెంచి కొత్త గృహాలు మంజూరు చేయాలని భావిస్తోంది.

లబ్ధిదారులకు అదనంగా రూ.35వేల రుణం

జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి వివిధ దశల్లో నిలిచిపోయిన 16,066 ఇళ్లలో లెంటల్, శ్లాబు దశకు చేరి ఆగిపోయిన 3,044 నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసేందుకు గృహ నిర్మాణ సంస్థ ప్రణాళిక రూపొందించింది. అందుకు 100 రోజులు లక్ష్యంగా పెట్టుకుంది. ఆమేరకు అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారు. లెంటల్, శ్లాబు దశకు చేరిన గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్నారు. నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేస్తున్నారు. వీరికి రూ.1.80 లక్షల యూనిట్ విలువతోపాటు మరో రూ.35 వేలు రుణం ఇప్పించనున్నారు. పక్కాగృహాలు నిర్మించుకుంటున్న వారంతా పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. వీరికి ఇప్పటికే గృహ నిర్మాణాలకు బ్యాంకుల నుంచి రూ.35వేల రుణం అందించారు. అదనంగా రూ.35వేల ఇప్పించనున్నారు. ఇందుకు బ్యాంకులు కూడా సిద్ధంగా ఉండటంతో గృహ నిర్మాణాలను చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. అధికారులు కూడా లబ్ధిదారుల ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇటుక, కంకర, ఇసుక, స్టీలు అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పటి వరకూ లబ్ధిదారులు బిల్లుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కానీ కూటమి ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి చెప్పింది. వారంవారం బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించింది.



26 వేల పక్కా గృహాలు రద్దు

గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసి ఇప్పటి వరకూ ప్రారంభించని 26 వేల పక్కా గృహాలు రద్దు కానున్నాయి. యూనిట్ విలువ సరిపోకపోవడమే ఇందుకు కారణమైంది. ఒక్కో పక్కా గృహ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.1.50 లక్షలు మాత్రమే ఇచ్చింది. మరో రూ.30 వేలు ఉపాధి హామీ పథకం కింద చెల్లించేది. దాన్ని కలిపి యూనిట్ విలువ మొత్తం రూ.1.80 లక్షలు మాత్రమే. ఈ మొత్తం బేసు మట్టం నిర్మాణానికి కూడా సరిపోయేదికాదు. దీంతో అనేక మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు రాలేదు. ఈనేపథ్యంలో రాష్ట్రంలో ప్రస్తుతం ఏర్పడిన కూటమి ప్రభుత్వం పక్కా గృహాలకు యూనిట్ విలువను పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసి నిర్మాణాలు ప్రారంభం కాని లబ్ధిదారులు వాటిని నిర్మించుకునేందుకు విముఖత చూపుతున్నారు. యూనిట్ విలువ పెరుగుతున్నందున కొత్త ప్రభుత్వంలో ఇంటిని మళ్లీ మంజూరు చేయించుకుని నిర్మించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గతంలో మంజూరై నేటికీ ప్రారంభం కాని ఇళ్లను కూటమి ప్రభుత్వం త్వరలో రద్దు చేస్తుందని గృహ నిర్మాణ సంస్థ అధికారులు భావిస్తున్నారు.

ఒంగోలులో ఫ్లెక్సీ రగడ..!

- మాజీ మంత్రి బాలినేని ఫ్లెక్సీలో ఎమ్మెల్యే దామచర్ల ఫొటో
- ఆగ్రహం వ్యక్తంచేసిన తెలుగు తమ్ముళ్లు
- కనిపించని జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్ బొమ్మ

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 21 : ప్రకాశం జిల్లా ఒంగోలులో ఫ్లెక్సీ రగడ చోటుచేసుకుంది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేనలోకి రావడాన్ని స్వాగతిస్తూ ఆయన అభిమానులు శనివారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారితీసింది. వైసీపీకి చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవల ఆపార్టీకి రాజీనామా చేశారు. జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఆపార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. ఈనెల 26న ఆయన జనసేనలో చేరేందుకు దాదాపు ముహూర్తం కూడా ఖరారైంది. ఈనేపథ్యంలో బాలినేని అభిమాని అయిన ఇందుర్తి ప్రసాద్ (వైసీపీ కార్యకర్త), ఆయన స్నేహితులు కలిసి 'జిల్లా మెగాస్టార్ వాసన్నకు శుభాకాంక్షలు' అంటూ ఒంగోలులోని చర్చి సెంటర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.



ఒంగోలులోని చర్చి సెంటర్‌లో బాలినేని అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అందులో బాలినేని ఫొటోతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన సోదరుడు సినీ హీరో చిరంజీవి, టీడీపీకి చెందిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫొటోలను ఉంచారు. దీనిపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని తొలగించేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన కార్పొరేషన్ అధికారులు ఆ ఫ్లెక్సీని తొలగించి కార్పొరేషన్ కార్యాలయానికి తరలించారు.

ఎవరినడిగి ఫొటో పెట్టారు..

బాలినేని ఫ్లెక్సీలో ఎమ్మెల్యే దామచర్ల ఫొటో పెట్టడంపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ముత్తన శ్రీనివాస రావుతో పాటు యువత నగర అధ్యక్షుడు నలమోతు రమేష్, ఉపాధ్యక్షుడు ఉమర్ మాట్లాడుతూ.. గడిచిన ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉండటంతో టీడీపీ శ్రేణులపై అక్రమ కేసులు పెట్టించి అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేసిన బాలినేని ఫ్లెక్సీలో తమ నాయకుడు దామచర్ల ఫొటోను ఎవరిని అడిగి పెట్టారని ప్రశ్నించారు. ఫ్లెక్సీలో దామచర్ల ఫొటో పెట్టడం ఉద్దేశపూర్వకంగానే జరిగిందన్నారు. తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇదిలా ఉండా ఫ్లెక్సీలో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఫొటో లేకపోవడం విమర్శలకు తావిచ్చింది. దీనిపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.



ఫ్లెక్సీని తొలగించి కార్పొరేషన్ కార్యాలయానికి తరలిస్తున్న సిబ్బంది

26న జనసేనలోకి బాలినేని

- నేటి నుంచి అనుచరులతో భేటీలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఈనెల 26న జనసేన పార్టీలో చేరనున్నారు. ఆదివారం నుంచి జిల్లాలోని తన అనుచరులతో ఆయన భేటీ కానున్నారు. వచ్చే నెల 4వ తేదీన ఒంగోలులో జరిగే కార్యక్రమంలో చేరాలని బాలినేని భావించి ఆ మేరకు ప్రకటించారు. ఆ వెంటనే జగన్ జిల్లాలోని వైసీపీ నాయకులను కాపాడుకునే లక్ష్యంతో పార్టీ నేతలతో భేటీ అయి బూచేపల్లికి జిల్లా అధ్యక్ష పదవి, చెవిరెడ్డికి ఒంగోలు లోక్‌సభ పరిశీలకుడిగా బాధ్యతలు ఇచ్చారు. కిందిస్థాయి నాయకులెవ్వరూ బాలినేనితో వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో కారణం ఏమైనా జనసేన రాష్ట్ర నాయకత్వం కూడా బాలినేనిని త్వరగా పార్టీలోకి చేర్చుకోవాలని భావించింది. ఈ మేరకు 24వ తేదీ మంగళగిరి వద్ద జరిగే కార్యక్రమంలో మీ అనుచరులతోపాటు మీరూ చేరాలని ఆయనకు సూచించారు. దీంతో బాలినేని జిల్లాకు వచ్చి వైసీపీలో ఉన్న తన అనుచరులను సమీకరించుకునేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి ప్రకాశంలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా కనీసం 10 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ద్వితీయశ్రేణి నాయకుల్లో కొందరిని తనతోపాటు జనసేనలోకి తీసుకెళ్లే వ్యూహంలో బాలినేని ఉన్నట్లు తెలిసింది. ఆరేడు నియోజకవర్గాల్లోని వైసీపీ ఎంపీపీలు, జడ్పీటీసీల్లో కొందరు ఆయన వెంట నడిచే అవకాశం ఉంది. ఒంగోలు కార్పొరేషన్‌లోని వైసీపీ కార్పొరేటర్లల్లో సుమారు 23 మంది ఇంకా పార్టీలోనే ఉండటంతో వారిలో అత్యధికులను కూడా తనతో తీసుకెళ్లే ప్రయత్నంలో బాలినేని ఉన్నట్లు సమాచారం. అందుకే ఆయన ఆదివారం మధ్యాహ్నానికి ఒంగోలు చేరుకొని వైసీపీలో తనతో పరిచయం ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులతో భేటీ కావాలని నిర్ణయించుకున్నారు.

వీఆర్‌లో ఉన్న 15 మంది ఎస్సైలకు పోస్టింగ్

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 21 : జిల్లాలో వీఆర్‌లో ఉన్న 15 మంది ఎస్సైలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఒంగోలు నగరంలో మూడు పోలీసు స్టేషన్‌లకు 11 మందిని కేటాయించారు. ఒంగోలు తాలుకాకు ఐదుగురు, వన్‌టౌన్, టూటౌన్‌కు ముగ్గురేసిని నియమించారు. వీఆర్‌లో ఉన్న టి.త్యాగరాజు, పి.శివనాగరాజు, జి.సుబ్రమణ్యంలను ఒగోలు వన్‌టౌన్‌కు, ఎస్‌కే అబ్దుల్ రహమాన్, ఎం.శివనాంచారయ్య, ఏవీ సుబ్బారావును ఒంగోలు టూటౌన్‌కు కేటాయించారు. తాలుకా పోలీసు స్టేషన్‌కు వి.హరిబాబు, జి.సందీప్, ఎండీ ఫిరోజ్, ఎం.అనిత, కె.శ్రీనివాసరావును నియమించారు. పుల్లలచెరువు ఎస్సైగా బదిలీ అయి ఇంకా బాధ్యతలు స్వీకరించని పి.రాజేష్‌ను వీసీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎల్.సంపత్‌కుమార్‌ను పుల్లలచెరువు, జి.ప్రభాకర్‌రెడ్డిని గిద్దలూరు, వి.వెంకటేశ్వర రావును డీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన అధికారులు



హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్లుకు బొకే ఇస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 21: హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎస్.వెంకటేశ్వర్లు శనివారం ఒంగోలు వచ్చారు. స్థానిక ఎస్ఎస్సీ అతిథి గృహంలో బస చేసిన ఆయన్ను కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్, జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లాలోని వివిధ రకాల పెండింగ్ కేసులు, వాటి సత్వర పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వారి మధ్య చర్చ జరిగింది.

హైకోర్టు న్యాయమూర్తిని కలి సిన వారిలో ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్‌తోపాటు పలువురు సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

కల్తీ లడ్డూ బాధ్యులను శిక్షించాలి

- బీజేపీ నేత యోగయ్య యాదవ్ డిమాండ్

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 21 : తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారన్న అభియోగాలపై విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. టీటీడీ పవిత్రతను కాపాడాలని కోరుతూ స్థానిక చర్చిసెంటర్‌లో శనివారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లుగా టీటీడీలో జరిగిన అవినీతి బయటకు రావాలంటే కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సీబీఐచే విచారణ చేయించారు. లడ్డూ తయారీలో కల్తీకి కారకులైన అప్పటి టీటీడీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిలను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటి సీఎం జగన్‌రెడ్డికి తెలిసే ఈ కల్తీ లడ్డూల తయాంరీ జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఐ.సీతారామయ్య, బొద్దులూరి ఆంజనేయులు, కటారి సుధాకర్, గుర్రం రంగనాథ్, గుర్రం సత్యనారాయణ, గుర్రం శ్రీనివాసరావు, కాపూరి వాసు, విజయ్, వీరబ్రహ్మాచారి, మధు, కిలారు రవి, కె.ఆంజనేయులు, యు .నాగేశ్వరరావు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈపాపం ఊరికేపోదు : మంత్రి స్వామి

టంగుటూరు: 'శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. ఈపాపం ఊరికే పోదు జగన్‌రెడ్డీ' అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శనివారం స్థానికంగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో టీటీడీని అపవిత్రం చేసింది మీరే కదా! చేసిందంతా చేసి గుమ్మడికాయ దొంగల్లా జగన్, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని మంత్రి నిలదీశారు. తప్పులు చేయడం, బుకాయించడం వైసీపీ నేతలకు అలవాటేనని, శ్రీవారి ప్రసాదం కల్తీ ఘటనపై సీబీఐ విచారణ కోరే ధైర్యం వైసీపీ నాయకత్వానికి ఉందా అని మంత్రి ప్రశ్నించారు.

సంక్షోభం నుంచి సంక్షేమం వైపు..

- ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 21: సంక్షోభ పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని సంక్షేమం దిశగా నడిపిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణపరధిలోని 21వ వార్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు, సిక్కర్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. స్థానికుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు.

వంద రోజుల పాలనలో అన్ని వర్గాలకు లబ్ధి

చినగంజాం : టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. మండలంలోని గొనసపూడి, చింతగుంపల్లి గ్రామల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీడీవో కే.స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో వీరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలన్ని గ్రామాల్లోని ప్రజలకు అధికారులు, నాయకులు వివరించి, కరపత్రాలను. పంపిణీ చేశారు. గొనసపూడి గ్రామంలోని అంతర్గత రోడ్లకు రూ.25లక్షలు, చింతగుంపల్లి గ్రామానికి రూ.19 లక్షలను ఎమ్మెల్యే ఏలూరి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను మంజూరు చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అంతర్గత సిమెంట్ రోడ్లు నిర్మించేందుకు నాయకులు, అధికారులు భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. చినగంజాం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో చింతగుంపల్లి సర్పంచ్ యార్లగడ్డ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులు కే.కృపారావు, ఎ.మస్తాన్‌రావు, అనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు విక్రం వెంకటరావు, దివ్వకోలు రాము, సందు శ్రీనివాసరావు, కనపర్తి వీరాస్వామి, పట్టాభి వెంకటేశ్వర్లు, రాయపాటి స్వామి, దావూలూరి రమేష్, జీవన్, అబ్దుల్ కలాంఆజాద్, మోటుమర్రి రామసుబ్బారావు, షేక్ జిలాని, భయ్యా సతీష్, శివరామకృష్ణ, షేక్ నబీషా పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలో ఇంటింటికీ ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం నాయకులు నిర్వహించారు. స్టాలిన్ పేట, శివాలయం బజారులో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బల్లికురవ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎంపీడీవో రాంబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుంటుపల్లి, వైదన గ్రామాల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ 100 రోజుల పాలన, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమాలలో సర్పంచ్ మాదాల కృష్ణకూమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం 5వ వార్డులో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్లవల్లి పూర్ణచంద్రరావు, సిహెచ్ అనిల్, రమణ పాల్గొన్నారు.

మార్టూరు : ఇది మంచి ప్రభుత్వమని, ప్రజలు అందరూ సహకరించాలని కోలలపూడి సర్పంచ్ ఎం.సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కోలలపూడి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ కార్యదర్శి లక్ష్మి అధ్యక్షత జరిగింది. అనంతరం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో అంగనవాడీ, ఆశాలు, దేవదాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పద్మావతి

పౌష్టికాహారంతోనే భవితకు పునాది

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21 : పౌష్టికాహారంతోనే భవితకు పునాది అని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అన్నారు. శనివారం అద్దంకిలోని శ్రీనివాస కల్యాణ మండపంలో కొరిశపాడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీవో ఏ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన పోషక మాసోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పద్మావతి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, పిల్లలు, పిల్లల తల్లులు ఉపయోగించుకోవాలన్నారు. బాలామృతం, ఫోర్టిఫైడ్ రైస్, కందిపప్పు, రాగిపిండి, గుడ్లు, పాలను కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నట్లు చెప్పారు. చిన్నప్పటి నుంచే పోషకవిలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆడ పిల్లలు ధృడంగా తయారవుతారన్నారు. అనంతరం పలువురికి సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. భవిత కేంద్రం, బాలికల ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య స్కూల్‌ను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో డి.గంగాధరరావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, ఎస్ఐ ప్రవీణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, బి. ఇందిరమ్మ, ఇందిర, ఆర్ఐ శంకర్, వీఆర్‌వో రాంబాబు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చినగంజాం : గర్భవతులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఇంకొల్లు సెక్టార్ సీడీపీవో టీ.ఝాన్సీ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన టీహెచ్ఆర్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం సామూహిక సీమంతాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే.వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి


మేదరమెట్లలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐలు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21 : ప్రజలు, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జిల్లా రిసోర్స్ పర్సన్ గాలి స్వరూప్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కలవకూరు గ్రామంలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ వారు మీకు తెలుసా ఐఈసీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత చెడు సావాసం, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో ర్యాలీ, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లింక్ వర్కర్స్ అంజలీదేవి, వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ , సచివాలయ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల : యువత హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై అవగాహన పెంచుకోవాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలన సంస్థలు, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అద్దంకి రూరల్‌సీఐ మల్లికార్జునరావు, అద్దంకి సీఐ కృష్ణయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, వర్కర్లు దుర్గా, మల్లేశ్వరి, కృష్ణవేణి, శ్రావణి, భార్గవ్ రాధా, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు విలువైనవి

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 21 : విజయవాడ వరద ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుధ్య సిబ్బంది అందించిన సేవలు విలువైనవని, వారిది కీలకపాత్రని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక ఓటీలో శనివారం మున్సిపల్ చైర్మన్ జంజనం అధ్యక్షతన జరిగి స్వచ్ఛత హి సేవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించిన మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, ఇతర అధికారులు, పారిశుధ్య సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా సెల్ఫీ బూత్‌లో ఎమ్మెల్యే కొండయ్య, ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావులు కలసి ఫొటోలు దిగారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

పంగులూరు, సెప్టెంబరు 21 : సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా సాగుతున్నాయని ఎంపీడీవో రామాంజనేయులు అన్నారు. మండలంలోని రేణంగివరం, కశ్యాపురం గ్రామాలలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ బ్రోచర్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, కశ్యాపురం గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల వెంకటరావు, కార్యదర్శి రాంబాబు, నారాయణస్వామి, చల్లగుండ్ల కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

అద్దంకి, సెప్టెంబరు 21 : సేవా పక్వాడా కార్యక్రమాలలో భాగంగా బీజేపీ నేతలు శనివారం అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్య క్రమంలో హెచ్ఎం పద్మావతి, బీజేపీ నేతలు కాలేషాబాబు విరాట్, కొండ్రగుంట శ్రీనివాసరావు, దేవరపల్లి సురేష్,కొత్తమాసు నాగరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్ల క్యూ

- ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో చేరికలు
- గతంలో 12 మంది, తాజాగా మరో ఇద్దరు
- చైర్మన్ జంజనంతో న్యాయవాది మంతనాలు
- సమీప బంధువుతో రియల్ వ్యాపారి చర్చలు


ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు

చీరాల, సెప్టెంబరు 21 : చీరాల మున్సిపల్ కౌన్సిలర్లు వైసీపీ నుంచి టీడీపీలోకి క్యూ కడుతున్నారు. గతంలో 12 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. తాజాగా శనివారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 9, 10 వార్డుల కౌన్సిలర్లు మల్లిల లలితా రాజశేఖర్, గోలి స్వాతి ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. కొండయ్య వారి మెడలో పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. మిగిలిన అందరూ కూడా తమ వైపు వస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల నుంచి ఓ న్యాయవాది వైసీపీ మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో మంతనాలు జరుపుతున్నారు. ఎమ్మెల్యే కొండయ్యతో కలసి ప్రయాణం చేయాలని, జంజనంతో పాటు ఆయన వర్గీయులు కలసి రావాలని ఆ మంతనాలు సారాంశంగా తెలిసింది. ఇదిలావుండగా జంజనం సమీప బంధువుతో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కూడా ఇదే అంశానికి సంబంధించి మంతనాలు జరిపినట్లు సమాచారం. దీంతో చీరాల రాజకీయ ముఖచిత్రం మారనుందనేందుకు తాజాగా మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలోకి చేరడంతో స్పష్టమవుతుంది.

మనసులో మాట జంజనంకు చెప్పిన ఎమ్మెల్యే కొండయ్య

నియోజకవర్గ ఎమ్మెల్యే కొండయ్య, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మధ్య శుక్రవారం జరిగిన సంభాషణలపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. మున్సిపల్ పరిధిలో రూ.65.10లక్షల వ్యయంతో మున్సిపల్ పరిధిలోని డ్రైన్లలో సిల్ట్ తీసే 13 పనులకు సంబంధించిన ప్రారంభ పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే, చైర్మన్, పలువురు కౌన్సిలర్లు, అధికారులు హాజరయ్యారు.

ఆ సందర్భంగా ప్రారంభ కార్యక్రమ అనంతరం ఎమ్మెల్యే కొండయ్య ఇంకెందుకు మీరు కూడా పార్టీలోకి రండి బ్రదర్ ... కలిసి పని చేద్దాం అని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావును నవ్వుతూ అడిగి తన మనసులో మాట చెప్పారు. మా మనస్సు అంతరాత్మ మీకు తెలుసు. గతంలో కలసి పనిచేసినవాళ్ల మేగదా అని జంజనం నర్మగర్భంగా సమాధానం చెప్పారు. ఈ క్రమంలో శనివారం మరో ఇద్దరు కౌన్సిలర్లు టీడీపీలో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

మున్సిపల్ పాలకవర్గంలో మారిన బలాబలాలు

మున్సిపల్ పాలకవర్గం ముఖచిత్రం మారుతోంది. బలాబలాలు మారుతున్నాయి. మున్సిపాలిటీ పాలకవర్గం మొత్తం 33 మంది. కోఆప్షన్ సభ్యులు ముగ్గురు. తాజాగా వైసీపీ కౌన్సిలర్లు ఇద్దరు టీడీపీలో చేరడంతో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు సంఖ్య చెరిసమానం అయింది. వైసీపీకి చెందిన ఇద్దరు వైస్ ఛైర్మన్లు, 11 మంది కౌన్సిలర్లు, ఛైర్మన్‌తో వారి సంఖ్య 14కు పడిపోయింది. గతంలో 12 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే కొండయ్య వైపు ఉండగా తాజాగా మరో ఇద్దరు చేరడంతో వారి సంఖ్య 14కు చేరింది. మిగిలిన ఐదుగురు కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ వర్గంగా ఉన్నారు.

మరికొందరు చేరే అవకాశం

వైసీపీ వర్గంగా ఉన్న కౌన్సిలర్లలో మరికొంత మంది టీడీపీలో చేరే అవకాశం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రోజుల వ్యవధిలోనే ఆ పరిణామాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వైసీపీ దుకాణం ఖాళీ అవుతుందా లేకుంటే నామ మాత్రంగా ఉంటుందా అనేది వేచిచూడాలి.

సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

45వేల విద్యుత్ కనెక్షన్ల మంజూరు లక్ష్యం : మంత్రి గొట్టిపాటి


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి, కలెక్టర్ వెంకటమురళి

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 21 : యద్దనపూడి మండలం యనమదల గ్రామ పంచాయతీపరిధిలో రూ.2 కోట్ల 80లక్షల వ్యయంతో నిర్మించనున్న 33బై 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శనివారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అద్దంకి డీఈ మస్తానరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్య, కూలేందుకు సిద్ధంగా ఉన్న కరెంట్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు తదితర సమస్యలను ఎమ్మెల్యే ఏలూరి తనదృష్టికి తెచ్చారన్నారు. అందులో భాగంగా సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రెండు నెల్లో పూర్తిచేసి రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 45వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల మంజూరు లక్ష్యంగా నిర్ణయించామని గొట్టిపాటి పేర్కొన్నారు. ఇప్పటికే 12 నుంచి 13 వేల దాకా కనెక్షన్లు మంజూరు చేసినట్లు చెప్పారు. మరో రెండు నెలల్లో మిగిలిన కనెక్షన్లు ఇస్తామన్నారు. ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ సబ్ స్టేషన్ ఏర్పాటుతో లోవోల్టేజీ సమస్య తీరనుందన్నారు. సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో మరో రెండు చోట్ల సబ్ స్టేషన్ల నిర్మాణం అవసరమని, మంత్రి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, ఆర్‌డీవో గంధం రవీందర్, విద్యుత్ ఎస్ఈ సత్యన్నారాయణ, ఏడీఈ సురేంద్రబాబు, ఏఈ సురేష్ బాబు, నాయకులు రంగయ్య చౌదరి,,గుదే తారకరామారావు, దండా వీరాంజనేయులు,సాదినేని సుధీర్ పాల్గొన్నారు.


ప్లాస్టిక్ వ్యర్థాలను చూపుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

చీరాల, సెప్టెంబరు 21 : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో సుమారు 85 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్‌కు పంపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని ఎవరివారు మానుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి స్వరూప్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


క్రీడాకారులతో మాట్లాడుతున్న ప్రతినిధులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

జాండ్రపేట(చీరాలటౌన్), సెప్టెంబరు 21 : విద్యార్థులు ఆటలు ఆడడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శరీరదారుఢ్యం ఉంటుందని ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ శేఖర్ కరిముల్లా అన్నారు. గతరెండు రోజులుగా చీరాల మండల పరిధిలోని జాండ్రపేట హైస్కూల్‌లో జరుగుతున్న మండల స్థాయి అథ్లెటిక్స్ స్కూల్ గేమ్స్ శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా చివరి రోజున కరిముల్లా హాజరయి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విజేతలుగా నిలిచిన క్రీడాకారులు వేటపాలెంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆ పోటీల్లో సత్తాచాటి మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. పోటీలకు సహకరించిన గ్రామ పెద్దలకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు


దుకాణంలో తనిఖీ చేస్తున్న ధనరాజ్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21 : ఎరువులను అధిక ధరలకు అమ్మితే లైసెన్సులు రద్దు చేసి, కేసులు నమోదు చేస్తామని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ హెచ్చరించారు. శనివారం అద్దంకిలోని ఎరువుల దుకాణాలను ఆయన వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి సోదాలు చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో బిల్లులను పరిశీలించారు. డీఏపీ 50 కేజీలు రూ.1,350, యూరియా రూ.267కి అమ్మాలని సూచించారు. అంతకు మించిన ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతు సేవా కేంద్రాలల్లో యూరియా, డీఏపీ సిద్ధంగా ఉన్నట్లు ధనరాజ్ తెలిపారు. రైతులు వినియోగించుకోవాలి కోరారు.

దుకాణదారులకు హెచ్చరిక

చీరాలటౌన్ : ఎరువుల విక్రయాలు నిబంధనలను అనుసరించి జరగాలని భిన్నంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారిణి సుమతి హెచ్చరించారు. ఇటీవల కాలంలో అధికారులకు విక్రయాలపై ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ వెంకటమురళి, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ ఆదే శాల మేరకు ఏవో శనివారం మండల పరిధిలోని దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాక్ పరిశీలించారు. ధరల పట్టికపై సూచనలు చేశారు. బిల్ బుక్స్, లైసెన్స్‌లు తనిఖీ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవో వెంట వీఏఏ ప్రసన్న, సిబ్బంది ఉన్నారు.

బల్లికురవ : ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లును షాపు యజమానులు ఇవ్వాలని లేకుంటే చర్యలు తప్పవు అని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి హెచ్చరించారు. శనివారం పలు దుకాణాలను తనిఖీ చేశారు.

చినగంజాం : ఎరువుల దుకాణాదారులు నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యసాయాధికారి కట్టెబోయిన భాస్కరరావు హెచ్చరించారు. సంతరావూరు, పెదగంజాం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కారంచేడు : ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయాధికారి సుధీర్‌బాబు హెచ్చరించారు. కారంచేడులోని ఎరువుల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు.

మార్టూరు : మండలంలోని ఎరువుల దుకాణాలను శనివారం మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిల్లులు, రికార్డులను పరిశీలించారు. ఎరువులను అధికధరలకు అమ్మితే చర్యలను తీసుకుంటామన్నారు. కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు. రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచుతామన్నారు. అదేవిధంగా ఎవరైనా అధిక ధరలకు అమ్మితే వారిపై రైతులు తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

తీరాన్ని కాపాడటం అందరి బాధ్యత

ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 21 : తీరప్రాంతంలో సముద్రం ప్రశాంతతను కాపాడడం, కాలుష్య రహిత వాతావరణం అందరి బాధ్యతను ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని పొట్టి సుబ్బయ్యపాలెం సముద్రతీరం వద్ద శనివారం మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సాగర్ - సురక్షిత్ సాగర్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్రకృతి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రకృతికి విరుద్ధంగా మానవ మనుగడ సాగలేదన్నారు. సముద్రానికి వచ్చే పర్యాటకులు తీరంలో ప్రశాంత, పరిశుభ్ర వాతావరణానికి భంగం కలగకుండా మసలుకోవాలన్నారు. వ్యర్థాలను తీరంలో వేస్తూ, ప్రధానంగా ప్లాస్టిక్ కారణంగా నెలకునే ప్రతికూల పరిస్థితులను వివరించారు. ఇంటిని, ఒంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో, తీరాలను కూడా అలానే పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా తీరంలో విద్యుత్ లైట్లు వేయించాలని స్థానికులు కోరగా ఎమ్మెల్యే కొండయ్య వెంటనే పంచాయతీ అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి బాధ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మ చెట్ల తొలగింపు


పొలం దారిని బాగు చేసిన పంచాయతీ సిబ్బంది

బల్లికురవ, సెప్టెంబరు 21 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామం నుంచి మురికిపూడి వయా యడవల్లి గ్రామాల పరిధిలో ఉన్న పొలాలకు వెళ్లే రోడ్డులో చిట్టడవిని తలపించేలా తుమ్మ చెట్లు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రైతుల ఇబ్బందులను తెలుసుకున్న ఉప్పుమాగులూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ శాంతి, టీడీపీ నాయకులు దేవినేని నరేంద్ర పంచాయతీ నిధులతో పొలాలకు వెళ్లే రోడ్డులో ఉన్న తుమ్మ చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించే పనులు చేపట్టారు. దీంతో కొంత మోక్షం కలిగిందని, రోడ్డుకు గ్రావెల్ మట్టిని తోలితే సమస్య తీరుతుందని రైతులు తెలిపారు. ఎంతో కాలంగా పొలాల రోడ్డులో ఉన్న తుమ్మ చెట్లను తొలగించడంపట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బల్లికురవ, సెప్టెంబరు 21 : వరి పంటలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ అధికారి కుమారి తెలిపారు. శనివారం పొలంబడి కార్యక్రమంలో బాగంగా అంబడిపూడి గ్రామంలో రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. ఎంటల సాగు, పెట్టుబడులు, రసాయనిక ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన ఏవో కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ ప్రవిణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు దద్దాల అంజయ్య, అనిల్, సుబ్బారావు, బొట్టగుంట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బల్లికురవ. సెప్టెంబరు 21 : మండలంలోని కొణిదెన ముస్లింకాలనీకి చెందిన ఓ వివాహిత ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో అసభ్యంగా పరవర్తించిన షేక్ హనీషాపై శనివారం కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 8న కొణిదెన గ్రామానికి చెందిన వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మద్యం సేవించి ఇంట్లోకి వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై వివాహిత శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రేపు మండల స్థాయి క్రీడా పోటీలు

చినగంజాం, సెప్టెంబరు 21 : జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల23వ తేదీన ఉదయం 10 గంలకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం డీ రత్నకుమారి, పీడీ గంటా అంకమ్మ శనివారం ప్రకటలో తెలిపారు. ఈ క్రీడా పోటీలలో అండర్-14, అండర్-17 విభాగాలలో బాలబాలికలకు కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పీడీ కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

పర్చూరు, సెప్టెంబరు 21 : నోవా అగ్రిటెక్ లిమిటెడ్, ఏలూరి చారిటబుల్ ట్రస్టు, శంకర్ కంటి ఆసుపత్రి పెద్ద కాకాని సంయుక్త ఆధ్వర్యంలో పర్చూరులోని వైఆర్ హైస్కూల్ ప్రాంగణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించటం జరుగుతుందని ఏలూరి క్యాంపు కార్యాలయం ప్రతినిధులు తెలిపారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21: చేతులను శుభ్రపరుకోవాలని, తద్వారా ఎటువంటి జబ్బులు రాకుండా ఉంటాయని ఎంపీడీవో ఆర్.దేవసేనకుమారి అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో హ్యాండ్ వాషింగ్ డేని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో దేవసేనకుమారి మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత మన అందిరి బాధ్యత అన్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు పెద్దలకు కూడా చేతుల పరిశుభ్రత గురించి తెలియజేయాలని అప్పుడు ఆ కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు వెంకటరామయ్య ఆశా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

పంగులూరు, సెప్టెంబరు 21 : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న 120 మందికి శనివారం కంటి అద్దాలను అందచేశారు. క్లబ్ ఛైర్మన్ గరిమిడి జగన్మోహనరావు అధ్యక్షతన ముప్పవరంలో జరిగిన కార్యక్రమంలో రోగులకు ముందుగా వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్లారెడ్డి కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్లబ్ చైర్మన్ జగన్ మోహనరావు, అధ్యక్షుడు బత్తుల వీరనారాయణ శస్త్ర చికిత్స చేయించుకున్న రోగులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగబాబు, సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల అందజేత

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం శింగరకొండలోని వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులను అందజేశారు. విశ్రాంత టెలికం ఏఈ పసుపులేటి అంజనేయులు మునుమడు భానుప్రకాష్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధాశ్రమానికి సరుకులు అందించడం జరిగిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, రావూరి రంగయ్య, వృద్ధులు పాల్గొన్నారు.


పొలంపిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

మార్టూరు, సెప్టెంబరు 21 : పొలం పిలుస్తోంది పోస్టరును శనివారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సాంబశివరావు ఆవిష్కరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పోస్టరును వ్యవసాయఅధికారులు, రైతులతో కలిసి ఏలూరి ఆవిష్కరించారు.

అనారోగ్యంతో స్పృహ కోల్పోయిన విద్యార్థిని

- మోడల్ స్కూల్‌లో సమస్యలు
- పట్టించుకోని సిబ్బంది

చీరాలటౌన్, సెప్టెంబరు 21 : చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులను సమస్యలు వెంటాడు తున్నాయి. ప్రధానంగా పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో అవస్థలు పడు తున్నారు. తాజాగా వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. శనివారం సాయంత్రం ఇంటర్ విద్యార్థిని వాంతులతో స్పృహ కోల్పోయింది. ఉదయం నుంచే బాలికకు బాగులేపోయినా సిబ్బంది పట్టించుకోలేదన్న వాదనలు విన్పిస్తుంది. స్కూల్ జాతీయ రహదారిలో ఉండడంతో హాస్పిటల్‌కు తీసుకు వెళ్లేందుకు కూడా అవస్థలు పడాల్సి వచ్చింది. ఎట్టకేలకు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ స్కూల్‌కు ట్రాన్స్‌పోర్ట్ చాలా సమస్యగా ఉండడంతో ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ వద్ద ఆటోలు దిగి అక్కడి నుంచి అరకిలో మీటరు నడుచుకుంటూ స్కూలుకు వెళ్లాలి. మార్గంమధ్యలో పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతూ పిల్లలపై దాడి చేస్తున్నాయి. దీంతో అనేక మంది టీసీలు తీసుకుని ఇతర ప్రాంతాల్లోని స్కూళ్లకు వెళ్లిపోయారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 21 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో భర్తీ కాని సీట్లలో ప్రవేశాలకు నాల్గవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్ కె.శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 26వతేదీ లోపు దరఖాస్తును రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థి సదరు దరఖాస్తును ప్రింట్ తీసుకుని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27వ తేదీన తాను చేరదలచుకున్న ఐటీఐ కళాశాలలో సర్టిఫికెట్లను ధృవీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో 28న, ప్రైవేట్ ఐటీఐలలో 30వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

జీవన శైలి



కయ్యలో ఉప్పు సేకరిస్తున్న రైతు

రుచించని బతుకులు

"ఎంత పెద్ద వంటకమైన చిటికెడు ఉప్పు తగ్గితే రుచించదు. ఆ చిటికెడు ఉప్పే భోజనప్రియులను 'ఓహో' అనిపిస్తుంది. వంట మాస్టార్లనూ అభినందించేలా చేస్తుంది. వంటకాల్లో అంతటి మహిమగల ఉప్పు ఎక్కడ ఉత్పత్తి అవుతుంది?. సాగుదారులు ఎవరు? వారి సాధక బాధకాలు ఏమిటి!? ఆ అంశాలన్నీ క్రోడీకరిస్తూ ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.."

- ఏళ్ల తరబడి మారని తలరాతలు
- ప్రకృతిపైనే ఆధారపడి 'ఉప్పు' పరిశ్రమ
- అనుకూలించకుంటే ఆశలు గల్లంతే!
- ఇంటిల్లిపాది కష్టపడ్డా గిట్టుబాటు అంతంతే!
- పాలకులు మారినా నెరవేరని హామీలు

అల్లూరు, సెప్టెంబరు 21 : ప్రతి పంటకూ ఓ సీజన్ ఉంటుంది. సీజన్ ఆధారంగానే వ్యవసాయ దిగుబడులు, నాణ్యత, ధరలు ఆధారపడి ఉంటాయి. కానీ ఉప్పు రైతుల పరిస్థితి అలా ఉండదు. ప్రకృతిపై ఆధారపడి ఉత్పత్తి చేసే ఉప్పు సాగుదారులకు అప్పుడప్పుడు ఆ ప్రకృతే శాపంగా మారుతుంటుంది. ఉమ్మడి జిల్లాలోని కావలి నుంచి తడ తీరం వరకు ఏడు మండలాల్లోని సుమారు 45 వేల ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తి అవుతోంది. కావలి రూరల్ మండలం, అల్లూరు, విడవలూరు, బోగోలు తదితర మండలాల్లో 50 వేల మంది కుటుంబాలు ఉప్పు ఉత్పత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రకృతిలో చోటు చేసుకునే మార్పు చేర్పులపై ఉప్పు ఉత్పత్తి ఆధారపడి ఉంటుంది. ఏటా జనవరి నుంచి వర్షాలు ఉండవు కాబట్టి రైతులు ఉప్పు ఉత్పత్తికి పూనుకుంటారు. ప్రతిరోజూ నిద్రలేచి చద్దన్నం కట్టుకుని భార్యాభర్తలిద్దరూ ఉప్పు కయ్యల్లోకి వెళ్లి మధ్యాహ్నం వరకు కష్టపడతారు. కాస్త విరామం తర్వాత మళ్లీ అదే పని కొనసాగిస్తూ తమ స్వేదాన్ని ఉప్పు ఉత్పత్తి కోసం పెట్టుబడిగా పెడతారు. భానుడు ఉంటేనే ఉప్పు ఉత్పత్తి జరుగుతున్న క్రమంలో అర్ధంతరంగా వరుణుడు ఆగ్రహిస్తే మాత్రం ఆశలన్నీ నీటిపాలవుతాయి.

● దిక్కులేని ఉప్పు రైతులు

సాధారణంగా ఉప్పు ఉత్పత్తికి 20 నుంచి 25 రోజుల సమయం పడుతుంది. సముద్ర తీరంలో బోర్ల ద్వారా నీటిని తోడి కయ్యల్లో ముందుగా సిద్ధం చేసుకున్న గడుల్లో (గంజేరు) నింపుతారు. వారం రోజులపాటు ఎండకు బాగా ఆరనిచ్చి ఆ తర్వాత ఆ నీటిని మరో కయ్యలోకి మార్పు చేస్తారు. వారం, పది రోజుల్లో ఉప్పు ఉత్పత్తి అవుతుంది. అయితే, అన్ని పంటలకు నష్టాలు వాటిల్లితే వాటిని అంచనాలు వేసి అవసరమైన ఆర్థిక సాయాన్ని ప్రభుత్వాలు చేస్తుంటాయి. కానీ ఉప్పు రైతుకు మాత్రం అలాంటి సహకారాలు అందవు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా తమకు తీరని నష్టం వాటిల్లిందని పత్రికల ద్వారా సాగుదారులు ఘోషించినా కన్నెత్తి చూసేవారు లేరు.

● పథకాలు, సౌకర్యాలు లేక..

ఉప్పు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు, రుణాలు లేవు. పగలంతా ఎర్రటి ఎండలో చెమటలు చిందించి ఉత్పత్తి చేసే ఉప్పును చివరకు నిల్వ ఉంచుకునేందుకు సరైన వసతులు లేవు. గతంలో వీరికోసం ప్రత్యేక ఫ్లాట్‌ఫారాలను ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ హయాంలో అప్పటి పాలకులు హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. వ్యవసాయ రైతులకు ఇచ్చేవిధంగానే తమకూ బ్యాంకు రుణాలు అందచేసి సంక్షేమ పథకాలు అవసరమైన వసతులు కల్పించాలని కోరుతున్నారు.

● ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి

ఉప్పు అంతర్జాతీయస్థాయిలో జరిగే వ్యాపారం. అయినా ఉత్పత్తిదారుల్లో ఏమాత్రం ఆ వైపు ఆలోచన లేదు. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు ఉప్పును తరలిస్తుంటారు. అయితే గిట్టుబాటు ధర మాత్రం ఉండడం లేదు. వేసవిలో ఉత్పత్తి చేసే ఉప్పును వర్షాకాలంలో విక్రయించుకోవడం ఆనవాయితీ. ఆ సమయంలో ఉత్పత్తి అంతగా ఉండని కారణంగా నిల్వ చేసిన ఉప్పును కొనుగోలు చేసేందుకు వ్యాపారులు వస్తారు. అప్పుడు కూడా వ్యాపారులు అడిగిన ధరకే విక్రయించాల్సి ఉంది.

● ఊరిస్తున్న ధరలు

ఎన్ని కష్టాలు కుంగదీసినా గడిచిన మూడేళ్లగా ఉప్పు రైతులు కోలుకునే అవకాశం ఏర్పడింది. ఈ కాలంలో ధరలు కొంతమేర ఆశాజనకంగా మారాయి. క్వింటం రూ.60 నుంచి 90 వరకు పలుకుతున్న ధరలు ప్రస్తుతం రూ.300 నుంచి 450 వరకు పలుకుతోంది. సాధారణంగా ఒక ఎకరాల్లో ఉప్పు ఉత్పత్తికి రూ.35 వేల వరకు ఖర్చు అవుతుంది. ఎకరాలో 3 టన్నుల వరకు ఉత్పత్తి అవుతుంది. ఇప్పుడు పరిస్థితులు ఆశాజనకంగా ఉన్నాయని సాగుదారులు చెబుతున్నారు.



ఉప్పు రైతులను గుర్తించాలి



ప్రభుత్వాలు ఉప్పు రైతులను గుర్తించాలి. మేము పడుతున్న కష్టాలను రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక పథకాలను అమలు చేయాలి. ఇప్పటివరకు ఎటువంటి పథకాలు లేవు.. రుణాలు లేవు. కేంద్రం చర్యలు చేపట్టి ఉప్పు రైతులను గుర్తించి సహకరించాలి.

- గోళ్ళ ఆదాం, గోగులపల్లి

మార్కెట్ స్థిరత్వం కల్పించాలి



అన్ని రకాల పంటలకు ప్రత్యేక మార్కెట్ కల్పించినట్లుగానే ఉప్పు రైతులకు కూడా మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి. మార్కెట్ స్థిరత్వం లేక ఇబ్బందులు పడుతున్నాం. దళారులు అడిగే ధరకే విక్రయించాల్సి వస్తోంది. లేకుంటే కువ్వలు అలాగే ఉంచుకోవాల్సి వస్తుంది.

- గోళ్ళ విజయకుమార్, గోగులపల్లి

ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు



ఎన్ని కష్టాలు వచ్చినా కూడా ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదు. ఎంతమంది అధికారులకు, నాయకులకు మా గోడు వినిపించుకున్నా పట్టించుకోలేదు. అవసరానికి మమ్మల్ని వినియోగించుకోవడమే తప్ప మాకు ఉపయోగపడే ప్రభుత్వాలు లేకుండా పోయాయి.

- కిష్టయ్య

ఎల్లకాలం ఇవే బతుకులు



మేము చిన్నతనం నుంచి ఇవే బతుకులు బతుకుతున్నాం. అవే కష్టాలు, అవే బాధలు. స్థిరత్వం లేని జీవితాలు మావి. ప్రకృతి వైపరీత్యాలతో సంభవించే నష్టాలను ఎవరూ చూడడం కూడా లేదు. ఎవరికి చెప్పినా ఆలకించడం లేదు.

- సూరిశెట్టి సుబ్బయ్య.

'ఎక్సైజ్'లో సీఐడీ గుబులు

చేసుకున్నోళ్లకు చేసుకున్నంత.. అని పెద్దలు ఊరకే అనలేదు. మనం ఏ రకంగా వ్యవహరిస్తామో.. ఖర్మఫలం కూడా మనల్ని అదే రకంగా పరిగణిస్తుందన్నది సత్యం. ఇప్పుడు ఎక్సైజ్ శాఖలో కూడా అదే జరుగుతోంది. ఎన్నికల ముందు వరకూ వైసీపీ నేతల ఆదేశాలే శిరోధార్యం అన్నట్లుగా కొందరు అధికారులు వ్యవహరించగా.. ఇప్పుడు ఆ తీరే వారికి కునుకు లేకుండా చేస్తోంది. ఎప్పుడు సీఐడీ విచారణ మొదలవుతుందా? మొదలయ్యాక తమ పరిస్థితి ఏమిటి!? అన్న గుబులు వైసీపీ వీరభక్త అధికారుల్లో నెలకొంది.

- ఎన్నికల్లో వైసీపీ నేతలకు మద్యం సరఫరా
- వేళ్లన్నీ ఓ ఉన్నతాధికారి వైపే!
- విచారణ ఆపేందుకు విస్తృత ప్రయత్నాలు
- ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- మళ్లీ జిల్లాలో కొనసాగేందుకు లాబీయింగ్



నెల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి విచ్చలవిడిగా మద్యాన్ని వైసీపీ నేతలకు చేరవేశారు. దీనివెనుక ఓ అధికారి కీలకంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే వెంకటాచలం, పొదలకూరు మండలాల్లో భారీగా మద్యం డంప్‌లను పట్టుకున్నారు. వేల కొద్దీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో ఎక్సైజ్ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇందుకు బాధ్యులుగా కొన్ని దుకాణాల్లోని సిబ్బందిని తొలగించి చేతులు దులుపుకున్నారు. అయితే దీని వెనుక భారీ కుట్ర ఉందని టీడీపీ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. కానీ ఆ దిశగా విచారణ జరగలేదు. ఒక్క సర్వేపల్లిలోనే సుమారు 1.40 లక్షల మద్యం సీసాలను వైసీపీ నేతలకు చేరినట్లు ప్రాథమికంగా ఆధారాలు సంపాదించారు. ఇదే స్థాయిలో జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతలకు అక్రమ మార్గంలో మద్యం సరఫరా జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికల నాటి మద్యం అక్రమ వ్యవహారాలు తెరమీదకు వచ్చాయి. ఇటీవలే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి ఎన్నికల్లో జరిగిన మద్యం అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐడీ విచారణకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏ క్షణమైనా సీఐడీ విచారణ మొదలుకావచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

● సార్.. ఆదుకోండి ప్లీజ్!

ఎక్సైజ్ అధికారుల పాత్ర, ఆదేశాలు లేకుండా ప్రభుత్వ మద్యం దుకాణాలు, డిపో నుంచి భారీస్థాయిలో మద్యాన్ని వైసీపీ నేతలకు చేరవేయడం సాధ్యం కాదన్నది బహిరంగ రహస్యం. అయితే ఆ అధికారులు ఎవరన్నదే ఇప్పుడు కీలకంగా మారింది. ఎక్సైజ్ శాఖలోని ఓ అధికారిపైనే వేళ్లన్నీ చూపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు జిల్లాకు వచ్చిన సదరు అధికారి అప్పటి బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డికి అత్యంత సన్నిహితుడన్న పేరుంది. ఈ ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు కూడా ఉన్నట్లు ఎక్సైజ్ శాఖలో ప్రచారం నడుస్తోంది. ఇప్పుడు వాసుదేవరెడ్డి మెడకు ఉచ్చు బిగుసుకుంది. సీఐడీ కేసులు కూడా నమోదు చేసి విచారణ జరుపుతోంది. ఈ క్రమంలో జిల్లాలో విచారణ జరిపితే ఎక్కడ తన మెడకు కూడా ఉచ్చు బిగుసుకుంటోందనన్న భయంతో జిల్లాలోని సదరు అధికారి తెరవెనుక రాజకీయం మొదలుపెట్టారు. సీఐడీ విచారణ జరగకుండా శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. తన తండ్రిని వెంట బెట్టుకొని జిల్లాలోని ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నాడు వైసీపీ నేతల ఒత్తిళ్లతో తప్పు జరిగిపోయిందని, దీనిని మనసులో పెట్టుకో కుండా విచారణ ఆపించాలంటూ వేడుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అదే సమయంలో రాజధాని ప్రాంతంలోని తన సొంత జిల్లా నుంచి కొందరు ఎమ్మెల్యేల ద్వారా కూడా జిల్లాలోని ఎమ్మెల్యేలకు ఫోన్లు చేయిస్తున్నారు. ఇలా ఓ వైపు సీఐడీ విచారణ నిలుపుదల చేయించుకునే పని చేస్తూనే మరోవైపు జిల్లాలోనే కొనసాగేందుకు కూడా ముమ్మరంగా ప్రయత్నిస్తు న్నట్లు సమాచారం. అందుకుగానూ రాష్ట్ర స్థాయిలో కీలకమైన ఇద్దరు ప్రజాప్రతినిధుల ద్వారా సిఫార్సు కూడా చేయించు కున్నట్లు తెలిసింది. జిల్లాలోనే కొనసాగేందుకు హామీ కూడా లభించినట్లు ఎక్సైజ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

నేడు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ కౌన్సెలింగ్



జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన హరివర్మ

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 21 : జిల్లాలో ఒకేచోట రెండేళ్లు పని చేసిన సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ సహాయకుల బదిలీకి సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఆదివారం గుంటూరులోని స్టాంపులు - రిజిస్ట్రేషన్లశాఖ ప్రధాన కార్యాలయంలో జరుగుతోంది. దీంతో జిల్లాలో పెద్ద సంఖ్యలో సబ్ రిజిస్ట్రార్‌లు, సీనియర్ సహాయకులు బదిలీ కానున్నారు.

● ముగిసిన కౌన్సెలింగ్.. 33 మంది బదిలీ

స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ సహాయకులు, ఆఫీస్ సబార్డినేట్‌లు, షరాబుల బదిలీకి సంబంధించిన కౌన్సెలింగ్ శనివారం రాత్రి ముగిసింది. ఈ కౌన్సెలిం గ్‌లో 20 మంది జూనియర్ సహాయకులు, 12 మంది ఆఫీసు సబార్డినేట్‌లు, ఒక షరాబును జిల్లాలోని వివిధ కార్యాలయాలకు బదిలీ చేశారు. ఈ బదిలీల కౌన్సెలింగ్‌కు చైర్మన్‌గా జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ హరివర్మ, సభ్యుడిగా ఒంగోలు రిజిస్ట్రార్ బాలంజనేయులు వ్యహరించారు.

● జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా హరివర్మ

స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా సీఎస్ హరివర్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా మార్కెట్ వాల్యూ, ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు జిల్లా రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

27 నుంచి స్కూల్ గేమ్స్ క్రీడా జట్ల ఎంపికలు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 21 : జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ క్రీడాంశాల్లో అండర్-14 క్రీడాజట్ల ఎంపికల తేదీలు ఖరారుచేస్తూ శనివారం డీఈఓ రామారావు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ నెల 27వ తేదీన ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, సాఫ్ట్ టెన్నిస్, మోడర్న్ పెంటాథలిన్, పెనుబల్లి జడ్పీ పాఠశాలలో బాక్సింగ్, కావేరి నగర్ టెన్నిస్ అకాడమీలో టెన్నిస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే 28న టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్, రోప్ స్కిప్పింగ్, ఖోఖో, తైక్వాండో, రగ్బీ, యోగా పోటీలను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, ఫెన్సింగ్ రెయిన్‌బో పాఠశాలలో, నెట్‌బాల్‌ను బుచ్చి బాలికోన్నత పాఠశాలలో నిర్వహిస్తారు. 30న ఆర్చరీ, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, బేస్‌బాల్, సైక్లింగ్ ఎంపికలను ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోనూ, నెల్లూరు క్లబ్‌లో క్యారమ్స్‌ను నిర్వహిస్తారు. అక్టోబరు 1వ తేదీన ఏసీ స్టేడియంలో ఫుట్‌బాల్, కబడ్డీ, త్రోబాల్, టెన్నికాయిట్, కరాటే, షూటింగ్, జిమ్నాస్టిక్స్, సెపక్‌తక్రా, సాఫ్ట్‌బాల్ ఎంపికలను, 3వతేదీన వాలీబాల్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలుంటాయని డీఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి విజయ, పీఈటీలు పాల్గొన్నారు.

పరిశ్రమల శాఖ జీఎంగా మారుతీప్రసాద్

● కర్నూలుకు సుధాకర్ బదిలీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 21: జిల్లా పరిశ్రమల శాఖ జీఎంగా మారుతీప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జీఎంగా విధుల్లో ఉన్న సుధాకర్‌ను కర్నూలుకు బదిలీ చేస్తూ ఆయన స్థానంలో కర్నూలు జీఎం మారుతీప్రసాద్‌ను నెల్లూరు జీఎంగా బదిలీ చేశారు. రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈయన గతంలోనూ నెల్లూరులో జీఎంగా పనిచేశారు.

నకిలీ పోలీసుల గుట్టు రట్టు

● నలుగురి అరెస్ట్, రూ.21.21 లక్షల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

నెల్లూరురూరల్ : ముత్తుకూరు వద్ద పోలీసులమంటూ వాహన తనిఖీల పేరిట కారులోని రూ.50 లక్షలు అపహరించుకు వెళ్లిన నలుగురు నకిలీ పోలీసుల గుట్టు రట్టైంది. జిల్లాలో సంచలనంగా మారిన ఈఘటనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసు శాఖ ఒక్క రోజు వ్యవధిలో నకిలీ పోలీసులను అదుపు లోకి తీసుకుని వారి నుంచి రూ.21.21 లక్షలు నగదు, ఖరీదైన కార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసులు శనివారం రూరల్ పోలీసు స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. అల్లూరు మండలం ఇస్కపల్లికి చెందిన షేక్ హాసన్, జానీబాషా, బీద రవీంద్ర, న్యూ ఢిల్లీకి చెందిన మహ్మద్ ఇర్షాద్‌లు ముఠాగా ఏర్పడి ఉస్మాన్ అనే వ్యక్తికి ముత్తుకూరులో పొలం తక్కువ ధరకు ఇప్పిస్తామని రప్పించారు. కారులో రూ.50 లక్షలు తీసుకువస్తున్న ఉస్మాన్ ఏపీ జెన్‌కో రోడ్డు వద్దకు వచ్చేసరికి పోలీసుల మంటూ కారును తనిఖీ చేశారు. ముందస్తు పథకం ప్రకారం అందులో రూ.50 లక్షలతో ఉన్న బ్యాగును అపహరించుకువెళ్లారు. తనిఖీ చేసిన నకిలీ పోలీసులని తెలుసుకున్న బాధితుడు ముత్తుకూరు పోలీ సులకు ఫిర్యాదు చేయగా వారు రంగంలోకి దిగి నెల్లూరు రూర ల్, కోవూరు, రూరల్ సర్కిల్ పోలీసులతో దర్యాప్తు ప్రారంభిం చారు. సాంకేతికత ఆధారంగా నిదితులంతా విదేశాలకు పరార య్యేందు సిద్ధపడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వారి నుంచి ఖరీదైన జాగ్వార్ కారు, బోలెరో కారు, నగదు లెక్కింపు యంత్రాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలిం చారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను ఎస్పీ కృష్ణకాం త్ అభినందించారని, రివార్డుల కోసం సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.



పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, అధికారులు

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 21 : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు వ్యవసాయం లాభసాటిగా మార్చేందుకు నూతన సాంకేతిక పద్ధతులను తెలియచేయడంతోపాటు చీడపీడల నివారణపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాలు జరిగే ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖతోపాటు అనుబంధ శాఖల అధికారులు పాల్గొని క్షేత్రస్థాయిలో పొలాలను సందర్శించి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి, జిల్లా మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు, మార్కెటింగ్ ఏడీ అనిత, ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ



బాధితులకు దుప్పట్లు అందజేస్తున్న పీవీ రమణయ్య

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 21: ఆంధ్రప్రదేశ్ వలంటీర్ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో వరద బాధితులకు శనివారం దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. పాత రాజరాజేశ్వరిపేటలో వలంటీర్ హెల్త్ అసోసియేషన్ శాశ్వత సభ్యుడు, ఫఢ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పీవీ రమణయ్య సభ్యులతో కలిసి 250 కుటుంబాలకు దుప్పట్లు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మోహన్‌రావు, ఇస్మాయిల్, రుద్ర, శారద, విజయలక్ష్మి, మన్మోహన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 నాణెమా.. మాకొద్దు!

● తిరస్కరిస్తున్న వ్యాపారులు ● ఆర్‌బీఐ సూచనలు బేఖాతరు



వలేటివారిపాలెం, సెప్టెంబరు 21: మండలంలో వ్యాపారులు, పెట్రోలుబంకుల నిర్వాహకులు, చివరికి ఆర్టీసీ బస్సులో సైతం రూ.10 నాణేలు తీసుకోవడంలేదు. అదేమిటంటే మీరు ఇచ్చిన ఈ నాణేలు మళ్లీ మా వద్ద నుండి జనం తీసుకోవడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఓ ప్రక్క ఈ నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా తీసుకోనేం దుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. ఐదేళ్ల క్రితం ఆర్‌బీఐ రూ.10ల నోట్ల స్థానంలో వీటిని అందుబాటు లోకి తీసుకొచ్చింది. కొంతకాలం ఈ నాణేలపై ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా రెండేళ్లుగా దుకాణదారులు వాటిని తీసుకోనేందుకు విముఖత చూపుతున్నారు. రూపాయి, రెండు, ఐదు రూపాయల నాణేల తరువాత పది రూపాయల నాణెం విలువైనది. ఇప్పటికే ఐదేళ్ల దేశవ్యాప్తగా చెలామణిలో ఉన్నా మన ప్రాంతంలో అందుబాటులో లేదు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడు, చెన్నై, మహనగరాల్లో ఈ నాణెం చెల్లుబాటులో ఉంది. ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సుల్లో, వ్యాపార సముదాయాల్లో విరివిగా వినియోగిస్తున్నా రు. అక్కడ వినియోగంలో ఉన్న నాణేన్ని మండలంలో ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కావడం లేదని కొందరు చర్చించుకుంటున్నారు.

తీసుకోకపోతే కేసు

ఈ నాణెం చెల్లుబాటు అవుతుందని ఇటీవల రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంలకు, ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణ్యిజ సముదాయాల్లో నాణేన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు. పది రూపాయల నాణెం చెలామణీపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

నీరెళ్లే దారేది..



అధికారుల అనాలోచిత నిర్ణయంతో ఏర్పాటు చేసిన సిమెంట్‌రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుండడంతో పాదచారులు, వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. పట్టణంలోని బాలాజీనగర్‌లో గత కొన్నేళ్ల క్రితం దిగువలో వర్షపు నీరు వెళ్లలేని విధంగా సిమెంట్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. చిన్నపాటి వర్షానికే ఆ రహదారిపై నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసనతోపాటు దోమలకు ఉత్పత్తి కేంద్రంగా మారుతోంది. ఆ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- ఉదయగిరి రూరల్

కేబుల్ వైర్లు ఇలా.. స్తంభం ఎక్కేదెలా?



స్థానిక సౌత్ జనతాపేటలో ఆర్వోబీ వంతెన సమీపంలోని విద్యుత్ స్తంభం కనిపించ కుండా దాని చుట్టూ కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారు. ఇళ్ల సర్వీస్ వైర్లు మరమ్మతులు చేయాలన్నా, వీధిలైట్లు రిపేరు చేయాలన్నా స్తంభం ఎక్కేందుకు కూడా అవకాశాలు లేకుండా కేబుల్ వైర్లు ఉన్నాయి. ఈ విషయంపై సబంధింత అధికారులు స్పందించి కేబుల్ వైర్లు తీసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలి

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



స్థానిక బస్టాండు సెంటరులోని మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. ఈ ప్రాంతంలో జనాలు కూర్చోనేందుకు సిమెంటు బల్ల ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో ఎప్పుడు ఎవరికి ఏం ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- వలేటివారిపాలెం

న్యాయం చేయాలంటూ ఆందోళన

వరికుంటపాడు, సెప్టెంబరు 21: అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న భూమిని తిరిగి గ్రామానికే అప్పగించాలంటూ శనివారం విరువూరు గ్రామస్థులు ముడియాల మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సర్వే నంబరు 518లోని మేత పోరంబోకు భూమిలో నిబంధనలకు విరుద్ధంగా మొక్కలు నాటడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. తాము కోర్టును ఆశ్రయించినప్పటికీ తీర్పును ధిక్కరించిన అధికారులు జాయింట్ సర్వే చేయకుండానే పనులు చేపట్టారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

సంగం, సెప్టెంబరు 21: మండలంలోని దువ్వూరులోని ఆస్తాన ఏ నూరియా దర్గాలో గంధ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పీఠాధిపతి హజరత్ ఆల్ హజ్ షేక్ షాబాషా నూరి సాహెబ్ గంధాన్ని మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా దర్గాకు చేరుకుంది. అనంతరం మత పెద్దల ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కావలి రూరల్, సెప్టెంబరు 21: స్థానిక మద్దూరుపాడు సమీపంలోని ఏఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోని పేకాట స్థావరంపై శనివారం రాత్రి రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ రాజేశ్వరరావుకు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ బాజిబాబు దాడులు నిర్వహించి 6గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.9,130 స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తల్లి చెంతకు బాలిక

కావలి రూరల్, సెప్టెంబరు 21: స్థానిక జెండాచెట్టు సెంటర్‌లో తల్లి నుండి తప్పిపోయి ఏడుస్తూ తిరుగుతున్న 8ఏళ్ల షేక్ హబీబాను శనివారం రాత్రి 1వ పట్టణ సీఐ ఫిరోజ్ తల్లి వద్దకు చేర్చారు. వైకుంఠపురం ఫాతిమ తన కుమార్తె హబీబాతో షాపింగ్‌కు వెళ్లారు. అక్కడ తల్లి నుండి తప్పిపోయి ఏడుస్తూ హబీబా తిరుగుతుండటాన్ని గుర్తించిన స్థానికులు సీఐకు సమాచారం అందజేశారు. ఏఎస్‌ఐ శైలజను అక్కడకు పంపడంతో బాలిక నుండి వివరాలు తెలుసుకుని తల్లి చెంతకు చేర్చారు.

ఆశావర్కర్‌ను విధుల్లోకి తీసుకోవాలి

కలిగిరి, సెప్టెంబరు 21: విధుల్లోంచి తొలగించిన రావులకొల్లు ఆశవర్కర్ పందిటి విజయమ్మను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ శనివారం మండల ఆశా వర్కర్లు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచు రాజకీయ కక్షతో చిరుద్యోగిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఆమెకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ఉమా శంకర్ అక్కడికి చేరుకున్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా నిరసన చేపట్టాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఆశవర్కర్స్ యూనియన్ ప్రధనా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణ, మండల అధ్యక్షురాలు పల్లాపు అరుణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం



మారంరెడ్డిపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కలువాయి: : మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

సీతారామపురం, సెప్టెంబరు 21: సంక్షోభంలోనూ సంక్షేమాన్ని అందించి రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండల పరిధిలోని మారంరెడ్డిపల్లి అరుంధతివాడలో సర్పంచ్ గాజులపల్లి భారతి చంద్రరెడ్డి, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే మారంరెడ్డిపల్లి ఆర్‌సియం స్కూల్‌కి వెళ్లి మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పబ్బులేటిపల్లిలో నూతన బోరు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, ఎంపీటీసి తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, పిడుగు రమేష్, కాశీరత్తయ్య (గాంధి), గౌస్, మండల అధికారులు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూనూ అపవిత్రం చేశారు : ఎమ్మెల్యే కురుగొండ్ల

కలువాయి: కోట్లాది మంది భక్తులకు పరమపవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూనూ జగన్ అపవిత్రం చేశారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం కలువాయి మండలం బ్రాహ్మణపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించి కరపత్రాలు అందచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదికలో స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీక రించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీ డీవో గోవర్దన్, తహసీల్దారు సంజీవకుమారి, బీజేపీ వెంకటగిరి ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నాయకులు గంగోటి నాగేశ్వరావు, జీ వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఇంటూరి

గుడ్లూరు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పాలన అందిస్తుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మొగుశర్లారు కేజీబీవి పాఠశాల వసతి, భద్రతలను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు స్వర్ణ, ఉపాధి ఏపీడీ బాబూరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ సురేష్, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, నాయకులు జనిగర్ల నాగరాజు, సర్పంచ్ పాలకీర్తి శంకర్, ఎంపీటీసీలు చెన్నారెడ్డి వరమ్మ, గోచిపాతల శ్రవంతి, పువ్వాడి వేణు, రావూరి వేణు పాల్గొన్నారు.



గుడ్లూరు: మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

●**దగదర్తి (బిట్రగుంట):** చెన్నూరులో శనివారం ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. దగదర్తి చెరువులో ఆక్రమణలు తొలగిస్తామని, మండలంలో త్వరలో అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల కన్వీనర్ అల్లం హనుమతరావు, సోమశిల మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, పార్టీనేతలు గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, జలదంకి శ్రీహరినాయుడు, సర్పంచు నాయక్, మల్లికార్జునరెడ్డి, జనసేన వెంకట యాదవ్ ఉన్నారు.

●**సంగం:** జండాదిబ్బలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ఇందులో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ, తహసీల్దారు సోమ్లానాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు జి శ్రీనివాసులు యాదవ్, నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు తిరుమల నాయుడు, నరేష్, పాల్గొన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భా గంగా శనివారం టీడీపీ మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం సచివాలయ సిబ్బందితో కలిసి మండలంలోని కొత్తపేట, వెంగన్నపాళెం, లక్ష్మీపురం, దుత్తలూరు తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కాకర్ల మధు, చీదర్ల మల్లికార్జున, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, చుండి హరిగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే దాసరిపల్లి పంచాయతీలో మాజీ సర్పంచ్ సయ్యద్ జమృత్‌బేగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, ఈర్ల శంకర్, షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు : మండలంలోని కనియంపాడులో శనివారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దగదర్తి (బిట్రగుంట): ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

డిప్యూటీ సీఎంకు రూ. 2లక్షల చెక్కు అందజేత

సీతారామపురం : విజయవాడ వరద బాధితుల కోసం సీతారామపురం గ్రామానికి చెందిన ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాసేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ మెంబర్ భోగినేని కాశీరావు రూ.2 లక్షల చెక్కును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విజయవాడలో అందజేశారు. నియోజకవర్గ సమస్యలు, పార్టీ బలోపేతం గురించి పవన్‌తో చర్చించినట్లు కాశీరావు తెలిపారు.

కావలి : ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారులకు శనివారం కావలి ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి ముసునూరు పార్టీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. నలుగురికి రూ.1,30,285 వచ్చాయన్నారు. ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబు, వాటికోసం కృషిచేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.



డిప్యూటీ సీఎంను కలిసిన భోగినేని

మాలకొండ ఆదాయం రూ.8.57లక్షలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 21: మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి భక్తుల నుండి రూ.8,56,839 ఆదాయం వచ్చినట్లు శనివారం ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌తో రూ.5,850, కుంకుమార్చనతో రూ.18,480, తలనీలాలు ద్వారా రూ.31,700, వాహనపూజతో రూ.3,120, ప్రత్యేకదర్శనంతో రూ.1,71,800, కవర్లు ద్వారా రూ.6వేలు, రూము అద్దెలతో రూ.32,700, స్థల పురాణం, పుస్తకాలు విక్రయాలతో రూ.380, లడ్డుప్రసాదం ద్వారా రూ.2,06500, అన్నదానంతో రూ.3,19,793, విరాళముల ద్వారా రూ.60,516 వచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొండాపురం, సెప్టెంబరు 21: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ రవికుమార్ తెలిపారు. స్థానిక ఆదర్శపాఠశాలలో శనివారం జరిగిన మండలస్థాయి ఆటలపోటీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, షటిల్ బ్యాట్మింటన్ పోటీలో వివిధ పాఠశాలల నుంచి 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంఈవో-2 ఆనందరావు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌భాషా, మండల కో ఆర్డినేటర్ రాఘవరావు పాల్గొన్నారు.

కావలి టౌన్: విశ్వోదయా బాలల దినోత్సవ క్రీడాపోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమై అథ్లెటిక్స్ పోటీలు జరగ్గా, శనివారం గేమ్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీలో ప్రతిభ చూపి విద్యార్థులను విశ్వోదయా సెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి విజేతలను అభినందించారు. నవంబరు 15న జేబీ ఎంఎ హాల్‌లో జరగనున్న బాలల దినోత్సవంలో విజేత లకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి పోటీలను పర్యవేక్షించగా పీడీలు పీఈటీలు సహకారం అందించారు. ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

● **బిట్రగుంట :** కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో అథ్లెటిక్ పోటీలు ప్రారంభం అయ్యాయి. విజేతలకు కళాశాల స్పోర్ట్స్ డే రోజున జ్ఞాపికతో పాటు బహుమతులను అందజేయనున్నట్లు ఏవో ఆర్‌పీ రమణారెడ్డి తెలిపారు.

రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

వింజమూరు : ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శనివారం ఆర్‌అండ్‌బీ ఎస్సీ ఎం గంగాదర్‌తో రోడ్ల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీ గంగాధర్ మాట్లాడుతూ కలిగిరి, కొండాపురం, వింజమూరు రోడ్లను పరిశీలించామని వాటిలో కొన్నింటిని మంజూరు చేసినట్లు ఎమ్మెల్యేకి వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రామకృష్ణ, డి.ఈ చక్రధర్‌రావు, నేషనల్ హైవే డీఈ అనీల్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



విద్యుత్ సిబ్బందితో సమీక్షిస్తున్న డీఈ రమేష్ చౌదరి

సంగం, సెప్టెంబరు 21: వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డీఈ రమేష్ చౌదరి సిబ్బందికి సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం విద్యుత్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని, సోలార్ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అధిక లోడు ఉన్న ఏరియాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏడీ శ్రీనివాసులు, ఏఈ శ్రీనివాసులురెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డీఎస్పీ



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐలు

కావలి, సెప్టెంబరు 21: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాల నివారణలో భాగంగా శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విద్యాసంస్థల బస్సులు, పట్టణ ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎంతోమంది ప్రాణాలు డ్రైవర్ల చేతులలో ఉన్నాయని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల డాక్యుమెంట్లు ఉండాలన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదని, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మైనర్లుకు వాహనాలు ఇవ్వరాదని, బైక్‌లకు సైలెన్సర్లు విప్పి పెద్ద శబ్ధాలతో డ్రైవింగ్ చేసున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే 100కు డయల్ చేయండి

కలిగిరి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు సమాజంలో జరిగే అన్యాయాలు, అకృత్యాలపై శనివారం ఎస్‌ఐ ఉమాశంకర్ అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో ఆకతాయిలు అసభ్యంగా ప్రవర్తించినా లేదా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా వెంటనే 100డయల్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్‌రూల్స్‌పై అవగాహన కలిగిఉండటంతో పాటు, హెల్మెట్ ధరించాలని వాహన దారులకు తెలియజేయాలన్నారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లపై పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని, ఆన్‌లైన్ గేమింగ్స్, సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు 108కు సమాచారం అందించాలన్నారు.

మన ఇల్లు - మన గౌరవంపై అవగాహన

ఆత్మకూరు, సెప్టెంబరు 21: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో హౌసింగ్ ఏఈ గృహ నిర్మాణశాఖ పర్యవేక్షణకు నియమించబడ్డ సచివాలయ ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు మన ఇల్లు - మన గౌరవంపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రధానమంత్రి అవాస్ యోజన, ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకంలో నిర్మిస్తున్న పక్కా గృహాలను త్వరితగతిన పూర్తిచేసేందుకు ఈనెల 28న లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ప్రభుత్వం అందచేస్తున్న రూ. 1.8 లక్షలను గృహాలు నిర్మించుకుంటున్నవారికి స్టేజీల వారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా బేస్మెంట్ పూర్తి చేసుకున్న వారికి 50 రోజుల పని దినాలు, రూఫ్ లెవల్ వరకు చేసుకున్న వారికి 40 రోజుల పనిదినాలు వేతన రూపంలో చెల్లించడం జరుగుతుందని, పొదుపు సంఘాలలో ఉన్నవారికి అర్హతను బట్టి ఎస్‌హెచ్‌జీ రుణాలు ఇప్పిస్తామని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసుకునే విధంగా లబ్ధిదారులను చైతన్యపరచాలన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



భూ రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 21: మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు నాగరాజు హెచ్చరించారు. బ్రహ్మేశ్వరంలో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారని గ్రామస్థులతో కలిసి సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు ఫిర్యాదు చేయడంతో శనివారం రెవెన్యూ సిబ్బందితో ఆయా భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓ రైతు కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించి చదును చేశాడన్నారు. ఆభూమిలో ప్రవేశిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మల్లేశ్వరరావు, సర్వేయర్ మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగంలో ఇసుక విక్రయాల ప్రారంభం



టిప్పర్‌కు లోడు చేస్తున్న ఇసుక

సంగం, సెప్టెంబరు 21: సంగం వద్ద ఏర్పాటుచేసిన ఇసుక డంపింగ్ యార్డ్‌లో శనివారం విక్రయాలు ప్రారంభమయ్యాయి. సంగం పెన్నా నదిలో డ్రెడ్జింగ్ విధానంలో పడవల ద్వారా గత 20 రోజుల నుండి డీసిల్టేషన్ తీసిన ఇసుకను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. నిల్వచేసిన ఇసుకను ప్రభుత్వ ఆదేశాల మేరకు మెట్రిక్ టన్ను ఇసుక రూ. 350 చొప్పున టిప్పర్‌కు ఇసుక లోడ్ చేశారు. సచివాలయంలో ఆన్‌లైన్‌లో ఏపీ శాండ్ పోర్టల్‌లో చలానా తీసుకువచ్చిన వాహనదారులకు ఇసుక విక్రయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులతోపాటు మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్



ప్రైవేట్ బస్సులను అడ్డుకుంటున్న ఆర్టీసీ అధికారులు

కావలి, సెప్టెంబరు 21: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ప్రయివేట్ బస్సులు ప్రయాణికులను ఎక్కించుకోకుండా శనివారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయివేట్ బస్సులు డిపో వద్ద ఆపి ప్రయాణికులను ఎక్కించుకునే వెళుతుండటంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతుందని దీన్ని అరికట్టేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, బస్టాండ్ మేనేజరు రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవిప్రకాష్, ఉద్యోగ సంఘాల నాయకలు రఘునాథరెడ్డి, వెంకటేశ్వర్లు, చెంచురామయ్య, రమణయ్య, నారపరెడ్డి పాల్గొన్నారు.